# భారత్ శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 244 | హైదరాబాద్ | సోమవారం 23-03-2026 | పేజీలు : 12 | వెల : 1.00




ఖతార్‌లో కూలిపోయిన సైనిక హెలికాప్టర్...
**ఆరుగురి మృతి**

11లో



## తెలంగాణ రియల్ ఎస్టేట్ రంగానికి రేవంత్ సర్కార్ ఊతం...!

12లో


- టీడీఆర్ (TDR) నిబంధనల సరళీకరణ
- హైరైజ్ భవనాల కొత్త నిర్వచనం:టీడీఆర్ (TDR) వినియోగంలో భారీ వెసులుబాటు
- చిన్న ప్లాట్లలో భారీ నిర్మాణాలకు అవకాశం
- అదనపు అంతస్తులు మరియు సెట్ బ్యాక్ మినహాయింపులు:ఫీజుల చెల్లింపులో వినూత్న మార్పులు.
- వాయిదాల పద్ధతిలో టీడీఆర్ సమర్పణ

# రైతులకు శుభవార్త..

## రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి

11లో

- రైతు భరోసా పథకం కింద తొలి విడత నిధులు విడుదల
- మొత్తం రూ. 9,000 కోట్లలో... తొలి విడతగా రూ. 3,590 కోట్లు విడుదల
- సోమవారం రైతుల బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు
- ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలు ఆపబోమని సీఎం రేవంత్ హామీ
- పంట మార్పిడి అవసరమని రైతులకు సూచించిన ముఖ్యమంత్రి



## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం.. మారనున్న పాలిటెక్నిక్, ఐటీఐల భవిష్యత్

- తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ పరిధి విస్తరణ
- వర్సిటీ కిందకు 113 పాలిటెక్నిక్, 282 ఐటీఐ కాలేజీలు
- రద్దు కానున్న రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి
- ఉన్నత విద్యాశాఖ పరిధిలోకి స్కిల్స్ యూనివర్సిటీ
- విద్యా విధానం-2026 సిఫార్సుల మేరకు కీలక మార్పులు



11లో



## చమురు, గ్యాస్ సరఫరాపై ఢిల్లీలో ప్రధాని ఉన్నతస్థాయి సమీక్ష

- పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రధాని మోదీ ఉన్నతస్థాయి సమీక్ష
- పెట్రోలియం, గ్యాస్, విద్యుత్, ఎరువుల సరఫరాపై ప్రధానంగా చర్చ
- అంతర్జాతీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- ఇప్పటికే 70% చమురు దిగుమతులు గల్ఫ్ యేతర దేశాల నుంచేనన్న అధికారులు
- ఎల్‌పీజీ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టీకరణ

11లో

## హైదరాబాదులో శ్లాబు కూలి ఇద్దరు ఎలక్ట్రీషియన్ల మృతి



11లో

- బేగంపేటలో అపార్ట్‌మెంట్ శ్లాబు కూలి ఇద్దరి మృతి
- కరెంటు పని చేస్తుండగా ప్రమాదం.. ఇంటి యజమానికి తీవ్ర గాయాలు
- ఇంటి యజమాని పరిస్థితి విషమం

## అధికార పీఠంపై 8,931 రోజులు.. ప్రధాని మోదీకి అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు

- భారత చరిత్రలో సరికొత్త రికార్డ్ సృష్టించిన ప్రధాని మోదీ
- అత్యధిక కాలం ప్రభుత్వ అధినేతగా సేవలందించిన వ్యక్తిగా ఘనత
- ప్రధాని మోదీకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన సీఎం
- 8,931 రోజుల సేవ పూర్తి చేసుకుని చారిత్రక మైలురాయిని అధిగమించారని ప్రశంస
- మోదీ దార్శనికత, నిబద్ధత దేశ ప్రగతికి నిదర్శనమని వ్యాఖ్య

11లో



## నమిశ్రీ 'ఆరియా'లో అక్రమాల కోట!





12లో

- నాగోల్ బండ్లగూడ లో వేలకోట్ల అవినీతి రియల్ ఎస్టేట్ దందా:
- ఫోర్జరీ పత్రాలతో రూ. 100 కోట్ల ఫైనాన్స్.. అటవీ భూమి కబ్జా!
- రేరా నిబంధనలకు తిలోదకాలు ..
- ఫోర్జరీ నాలా కన్వర్షన్ సర్టిఫికెట్ :కోట్లల్లో లంచాలు తీసుకొని హెచ్ఎండిఏ అనుమతులు..
- మల్కాజ్గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ చర్యలు ఎక్కడ...!
- అధికారుల 'ముడుపుల' మత్తు.. ఎఫ్ఐఆర్ ఉన్నా ఆగని నిర్మాణాలు.. సామాన్యుడి సొమ్ముకు భద్రత ఏది?
- రేవంత్ సర్కార్ పైనే ఆశలు: స్పెషల్ అధికారి జయేశ్ రంజన్ , హైడ్రా రంగనాథ్ దృష్టి సారించి ఈ అక్రమ కోటను కూల్చేది ఎప్పుడు...!

ఫోర్జరీ పత్రాలతో పునాదులు వేసి, ప్రభుత్వ అటవీ భూములను కబ్జా చేస్తూ వెలుస్తున్న 'నమిశ్రీ అరియా' ప్రాజెక్టు ఒక అవినీతి కుంభకోణం. వందల కోట్ల బ్యాంకు రుణాలు పొందేందుకు నకిలీ ధృవపత్రాలను సృష్టించి, చట్టాన్ని చుట్టచుట్టేసిన బడా రియల్టర్ల దందా ఇది. ఎఫ్ఐఆర్ నమోదైనా, అధికారుల అండ దండలతో నిర్మాణాలు సాగుతుండటం వ్యవస్థల వైఫల్యానికి పరాకాష్ట.

హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారుల 'ముడుపుల' మత్తులో సామాన్యుడి కష్టార్జితం బలిపీఠం ఎక్కుతోంది. హైడ్రా (HYDRAA) మరియు ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ అక్రమ కోటను కూల్చకపోతే, నమ్మి కొనే మధ్యతరగతి ప్రజలు నట్టేట మునగడం ఖాయం. ఇది కేవలం భవనం కాదు, పేదల నమ్మకంపై నిర్మించిన అక్రమ సామ్రాజ్యం.

233.qxd 3/22/2026 11:07 PM Page 2



# సంపాదకీయం

## తెలుగు రాష్ట్రాల మధ్య ఫిలిం అవార్డ్స్

ఉగాది నాడు... తెలంగాణ చిత్ర పరిశ్రమ అవార్డుల వేడుక 'గద్దర్ అవార్డ్స్' కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. సీఎం, డిప్యూటీ సీఎం సమక్షంలో జరిగిన ఈ వేడుకకు చిత్ర పరిశ్రమకు చెందిన అతిరధులంతా వచ్చారు. 2025 సంవత్సరం ఉత్తమ చిత్రాలు, నటుల అవార్డులతో పాటు మెగాస్టార్ చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ అవార్డ్ ప్రదానం చేశారు.ఈ అవార్డుల ప్రదానోత్సంలో చిరంజీవి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. సందర్భమో.. అసందర్భమో తెలీదంటూనే ఆయన చేసిన వ్యాఖ్యలు కాస్త కాక రేపాయి. " తెలంగాణలో చిత్ర పరిశ్రమను బాగా గుర్తిస్తున్నారు.. పక్క రాష్ట్రమైనటువంటి మరో తెలుగురాష్ట్రం కళాకారుల పట్ల, సినిమాల పట్ల వారిని ఉత్సాహ పరిచే విధానంలో కొంచం వెనుకంజలో ఉందని భావిస్తున్నాను. సినిమా వాళ్లకి దగ్గరగా ఉండే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు గారు దీనిని ఇన్స్పిరేషన్ గా తీసుకుని మరింత ప్రోత్సహిస్తే కనుక బాగుంటుంది." అంటున్నారు. దీనిపై వెంటనే రియాక్షన్ వచ్చింది. చిరంజీవి స్థాయి వ్యక్తి.. పక్క రాష్ట్రంలో అవార్డుల ఇస్తున్న వేదికపై మాట్లాడటంతో అంతా దీని గురించి మాట్లాడటం మొదలుపెట్టారు. చిరంజీవి వ్యాఖ్యలే ఏపీకి కొంచం ఇబ్బందికరంగా మారితే.. మరో నటుడు ఆర్.నారాయణమూర్తి "చంద్రబాబు గారూ..తెలుగు చలన చిత్ర పరిశ్రమ ఉనికిని గుర్తించండి.. మీరు కూడా నంది అవార్డులు ఇవ్వండి" అంటూ ఆవేశంగా మాట్లాడారు. ఇద్దరు ముఖ్యమైన నేతలు ఓ రాష్ట్రంలోని అవార్డుల వేదికపై నుంచి మరో రాష్ట్రం గురించి మాట్లాడటం ఆంధ్రప్రదేశ్‌ను ఇరుకున పెట్టినట్లైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు కొంచం ప్రో యాక్టివ్‌గానే ఉండే వ్యక్తి. ఆయనకు సినిమా వాళ్లతో ఉన్న సన్నిహిత సంబంధాలు కూడా అందరికీ తెలిసిందే. ఇప్పుడు చిరంజీవి బహిరంగంగా ఇలాంటి కామెంట్ చేయడంతో ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రిత్వశాఖ స్పందిస్తుందా లేదా అన్నది చూడాలి. చంద్రబాబు నేరుగా రియాక్ట్ కాకపోయినా ఆ శాఖ నుంచి స్పందన వస్తుందేమో అని సినిమా ఇండస్ట్రీ చూస్తోంది. తెలుగు సినిమా రంగంలో స్టార్ హీరోగా ఉన్న పవన్ కల్యాణ్ ఏపీలో ఉపముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇప్పుడు వ్యాఖ్యలు చేసిన మెగాస్టార్‌కు ఆయన సోదరుడే. అప్పట్లో ఇండస్ట్రీ విషయంలో ఉన్న గ్యాప్‌ను సరిచేయడానికి పవన్ కల్యాణ్ కూడా ప్రయత్నాలు చేశారు. చిరంజీవి వ్యాఖ్యలపై ఎవరూ అధికారికంగా రెస్పాండ్ అవ్వకపోయినా .. తెలుగుదేశంకు అనుకూలంగా ఉండే సోషల్ మీడియా అకౌంట్లలో చిరంజీవి వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం అవుతోంది. వాళ్లు లేవనెత్తుతున్న పాయింట్లు ఏంటంటే.. ఆంధ్రప్రదేశ్‌కు చెందినటువంటి చిరంజీవి పక్క రాష్ట్రం అంటూ కామెంట్లు చేయడం ఏంటి.. ఆయన ఆంధ్రా వ్యక్తి కాదా అన్న ప్రశ్న వస్తోంది. ఒక రాష్ట్రానికి చెందిన అవార్డుల కార్యక్రమంలో వేరే రాష్ట్రాన్ని బహిరంగంగా అదే వేదికపై పాయింట్ అవుట్ చేయడం సభా మర్యాదేనా..?

చిరంజీవి కేవలం నటుడే కాదు. ఆయనకు ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు కూడా ఉన్నాయి. ఏపీ ఇండస్ట్రీ అభివృద్ధికి చిరంజీవి ఏమైనా కృషి చేశారా.. లేదా తన ఫౌండేషన్ ద్వారా ఏమైనా కార్యక్రమాలు చేశారా అని ప్రశ్నిస్తున్నారు.

వైజాగ్‌లో స్టూడియో ఏర్పాటు చేయడం తన డ్రీమ్ అని చిరంజీవి ప్రకటించారు. మరి దానికోసం ఏమైనా ప్రయత్నాలు చేస్తున్నారా..? ఆయనకు ఏపీ ప్రభుత్వం ఏమైనా సహకరించడం లేదా..?తెలుగు సినిమా ఇండస్ట్రీ అంటే అది హైదరాబాద్ కే సంబంధించినదిగా ఇండస్ట్రీ పెద్దలు వ్యవహరిస్తున్నారు. వాళ్లు ఆంధ్రాలో కనీసం సినిమా కార్యక్రమమైనా చేస్తున్నారా అని నిలదీశారు. కిందటి ప్రభుత్వం లాగా ఏపీలో సినిమా టికెట్ల రేట్లు పెంపు విషయంలో ఎలాంటి అభ్యంతరాలు పెట్టలేదు. ఇండస్ట్రీ నుంచి అడిగిన వెంటనే అన్ని సినిమాలకు రేట్లు పెంచతూ జీవోలు వచ్చాయి. తెలంగాణలో కొన్ని సినిమాలకు టికెట్లు రేట్లు పెంచకుండా ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినా సరే తెలంగాణతో సమానంగా ఇండస్ట్రీకి మేలు చేయడంలో ఏపీ వెనుకబడిందని చిరంజీవి వ్యాఖ్యానించడాన్ని వాళ్లు తప్పు పడుతున్నారు. సినిమా ఇండస్ట్రీ వాళ్లపై ఆగ్రహానికి మరో కారణం.. ఏపీలో టీడీపీ అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావొస్తున్నా ఇండస్ట్రీ నుంచి అధికారికంగా ఎవరూ ఇంతవరకూ సీఎం ను కలవలేదు. సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఓసారి మీటింగ్‌కు ప్రయత్నించారు. అప్పట్లో కొంతమంది పవన్‌కల్యాణ్‌ను కలిశారు. ఆ తర్వాత సీఎంతో మీటింగ్‌కు కిందటేడాది జూన్‌లో ప్రయత్నాలు జరిగాయి.

అయితే హైదరాబాద్‌లో వీరిని కలిసేవిధంగా ఓ ఆదివారం చంద్రబాబు టైమ్ ఇచ్చారు. కానీ కొంతమంది షూటింగ్‌లు ఉన్నాయని రాలేకపోవడంతో ఆ మీటింగ్ జరగలేదు. ఈ విషయాన్ని తెలంగాణ ఈఆఅ ఛైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్‌రాజు స్వయంగా చెప్పారు. ఇప్పుడు టీడీపీ అనుకూల సోషల్ మీడియా ఆ వీడియోలను వైరల్ చేస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత 2016 లో మూడేళ్లకు నంది అవార్డులు ప్రకటించారు. అయితే ఈ అవార్డుల ఎంపికపై విమర్శలు చెలరేగాయి. అవార్డుల ఎంపిక సక్రమంగా లేదంటూ అప్పటి వైఎస్సార్సీపీ నేత, నటుడు పోసాని కృష్ణమురళి వంటి వారు బహిరంగంగా వ్యాఖ్యలు చేశారు. అవార్డుల ప్రకటన అయితే జరిగింది కానీ.. వాటిని నేరుగా నటులకు అందజేయలేదు. ఉమ్మడి రాష్ట్రంలో సాధారణంగా ప్రతీ ఏడాది ఉగాది నాడు నంది అవార్డులను ప్రదానం జరుగుతుంది. ఒకవేళ ఓ సంవత్సరం ఇవ్వకపోయినా రెండు-మూ?డేళ్లకు ఓసారి అయినా ఇచ్చేవాళ్లు.. కానీ ఇంతవరకూ ఏపీ విభజన తర్వాత ఒక్కసారి కూడా నంది అవార్డుల ప్రదానోత్సవం జరగలేదు. కారణాలు ఏవైనా కానీ.. ఏపీలో కార్యక్రమం జరగకపోవడం ఓ లోటే. ఈ గ్యాప్‌ను సరిదిద్దడానికి ప్రయత్నాలు జరగాలి.

# ఆస్తుల లొల్లికి ఫుల్ స్టాప్... కామానా....






విజయవాడ, మార్చి 22,

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబంలో ఆస్తుల చిచ్చు మరోసారి బహిర్గతమైంది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన సోదరి షర్మిల, తల్లి విజయమ్మలపై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్ లో వేసిన పిటిషన్‌కు కౌంటర్‌గా విజయమ్మ శుక్రవారం ఒక కీలక అఫిడవిట్‌ను దాఖలు చేశారు. " వైఎస్సార్ బ్రతికున్నంత వరకు ఆస్తుల పంపకం జరగలేదు.. ఉన్నవన్నీ ఉమ్మడి కుటుంబ ఆస్తులే అని ఆమె ఈ అఫిడవిట్ ద్వారా స్పష్టం చేశారు. విజయమ్మ తన అఫిడవిట్‌లో జగన్ వాదనలను పూర్తిగా తప్పుపట్టారు. 2009లో వైఎస్సార్ మరణించే వరకు ఉన్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే . ఆస్తుల పంపకం ఎప్పుడూ అధికారికంగా జరగలేదన్నారు. తన మనవలు, మనవరాళ్లు నలుగురికి ఆస్తులను సమానంగా పంచాలన్నదే వైఎస్సార్ ఉద్దేశ్యం, ఆజ్ఞ అని ఆమె అఫిడవిట్‌లో పేర్కొన్నారు. సరస్వతి సిమెంట్స్ షేర్లతో పాటు, ఎంఓయూ లో లేని బెంగళూరులోని యలహంక ఇల్లు కూడా షర్మిలదేనని, అది వైఎస్సార్ ఆజ్ఞ అని తెలిపారు. జగన్ తన మేనల్లుడు, మేనకోడలికి అంటే షర్మిల పిల్లలకు అన్యాయం చేశాడని, ఇప్పటికైనా వారికి న్యాయం చేస్తాడని తల్లిగా ఆశిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఈ అఫిడవిట్‌ను వైఎస్ విజయమ్మ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్ లో సమర్పించారు. సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ షేర్ల బదిలీకి సంబంధించి జగన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఆమె ఈ వివరణ ఇచ్చారు. ఈ పత్రాన్ని నోటరీ చేయించి, అధికారికంగా ట్రిబ్యూనల్‌కు అందజేశారు.షర్మిల ఆస్తుల కోసం పాకులాడుతోందంటూ జరుగుతున్న ప్రచారాన్ని విజయమ్మ తీవ్రంగా ఖండించారు. షర్మిల వద్ద ఉన్న ఆస్తులు జగన్ ఇచ్చినవి కావు, అవి ఆమెకు రావాల్సిన వాటా మాత్రమే అని స్పష్టం చేశారు. అలాగే తనను బినామీగా చిత్రీకరించవద్దని, దేవుడి సాక్షిగా తాను చెబుతున్నవన్నీ వాస్తవాలేనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అసత్య ప్రచారాలను మానుకోవాలని మీడియాను వేడుకున్నారు. గతంలో వైఎస్ జగన్, షర్మిల మధ్య జరిగిన ఎంఓయూ ప్రకారం కొన్ని ఆస్తులను బహుమతిగా ఇస్తానని జగన్ పేర్కొన్నారు. వైఎస్ ఫ్యామిలీ ఆస్తులపై ఇంట ాబయటా పెద్ద రచ్చ జరుగుతోంది. పలువురు వైసీపీ నేతలు ఈ అంశంపై ప్రెస్ మీట్లు పెట్టి షర్మిలపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయమ్మ అఫిడవిట్ ద్వారా ఆస్తులపై వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించారు. ఇందులో అనేక కీలక అంశాలను ప్రస్తావించారు. వైఎస్సార్ మరణించే వరకు ఉన్న ఆస్తులన్నీ ఉమ్మడి కుటుంబ ఆస్తులే అని స్పష్టం చేశారు. ఆస్తుల పంపకం ఇప్పటివరకు అసలు జరగలేదని ఆమె కుండబద్దలు కొట్టారు. జగన్ ఎంవోయూరాసింది కూడా షర్మిల హక్కును గుర్తించేనని, అది ఏమాత్రం దానం కాదని ఆమె స్పష్టం చేశారు.వైసీపీ నేతలు మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని విజయమ్మ గోబెల్స్ ప్రచారంగా అభివర్ణించారు. షర్మిలకు జగన్ వేల కోట్లు ఇచ్చారని ప్రచారం చేయడంపై ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇప్పటి వరకు ఇచ్చిన డబ్బు ఆస్తి పంపకం కాదని, వ్యాపార లాభాల నుంచి ఇచ్చిన డివిడెండ్ మాత్రమేనని ఆమె క్లారిటీ ఇచ్చారు."నిజం ఏమిటో నా దేవుడికి, నా కొడుక్కి తెలుసు" అని అనడం ద్వారా విజయమ్మ ఒక తల్లిగా జగన్ మనస్సాక్షిని తట్టిలేపే ప్రయత్నం చేశారు. తన మేనల్లుడికి, మేనకోడలికి (షర్మిల పిల్లలకు) జగన్ అన్యాయం చేస్తున్నాడని ఆవేదన చెందారు. సరస్వతి సిమెంట్స్‌తో పాటు బెంగళూరులోని యలహంక ప్యాలెస్ కూడా షర్మిలదేనని ఆమె తేల్చి చెప్పారు.రాజకీయ ప్రయోజనాల కోసం తన కుటుంబాన్ని వాడుకోవద్దని ఆమె మీడియాను కోరారు. అసత్యాలు ప్రచారం చేస్తున్న వారెవరైనా సరే, దేవుడి న్యాయమే అంతిమమని ఆమె పేర్కొనడం ద్వారా నైతిక పైచేయి సాధించే ప్రయత్నం చేశారుఈ అఫిడవిట్ ద్వారా విజయమ్మ ఒక ముఖ్యమైన సాక్షిగా మారారు. రేపు కోర్టులో ఆస్తుల వివాదం నడిచినప్పుడు, వైఎస్సార్ బతికున్నప్పుడు ఉన్నవన్నీ కుటుంబ ఆస్తులేనని ఆమె చెప్పిన మాటలు జగన్‌కు ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. షర్మిల ఒంటరిగా పోరాడుతుందనే భావన కలగకుండా, కుటుంబ పెద్దగా విజయమ్మ ఆమె పక్షాన నిలిచారు. వైఎస్సార్ ఆశయం ప్రకారం నలుగురు మనవలకు సమాన వాటా దక్కాలనే పాయింట్‌ను ఆమె బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు."దేవుని సాక్షిగా నేను రాసినవన్నీ వాస్తవాలే" అని ముగించడం ద్వారా విజయమ్మ ఈ వివాదానికి అత్యున్నత ప్రాధాన్యతను ఇచ్చారు. అధికార బలంతోనో, అబద్ధపు ప్రచారాలతోనో గెలవాలని చూసేవారికి ఆమె పరోక్షంగా చురకలు అంటించారు. వైఎస్ కుటుంబంలో ఆర్థిక చిచ్చు ఇప్పట్లో తగ్గేలా లేదు. వైయస్ కుటుంబ ఆస్తుల వివాదంలో తల్లి విజయమ్మ తాజాగా వేసిన అఫిడవిట్ ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారుతుంది. తన సొంత కుమారుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి.. తన మనవలైన షర్మిల పిల్లలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాడంటూ ఆమె నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ లో అఫిడవిట్ దాఖలు చేశారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి బతికున్నంతవరకు ఆస్తుల పంపకం జరగలేదని.. ఉన్నవన్నీ ఉమ్మడి కుటుంబ ఆస్తులేనని ఆమె తేల్చి చెప్పారు. తన నలుగురు మనవలు, మనవరాళ్లకు ఆస్తులను సమానంగా పంచాలన్నదే రాజశేఖర్ రెడ్డి ఆఖరి కోరికగా, ఆజ్ఞగా ఆమె గుర్తు చేశారు. కొంతకాలంగా వైఎస్ కుటుంబంలో ఆస్తి వివాదం జరుగుతున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా సరస్వతి సిమెంట్స్ షేర్లతో పాటు ఇతర ఆస్తుల విషయంలో వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విజయమ్మ తన కుమార్తె షర్మిలకు అండగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జగన్మోహన్ రెడ్డి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ను ఆశ్రయించారు. తన తల్లి షేర్‌ను చెల్లెలు షర్మిల దక్కించుకోవడంపై పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గత కొద్దిరోజులుగా వాదనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో విజయమ్మ అఫీడవిట్ దాఖలు చేశారు. జగన్ తన మేనల్లుడు, మేనకోడలికి దక్కాల్సిన వాటాలు ఇవ్వకుండా మోసం చేయడం పై విజయమ్మ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సరస్వతి సిమెంట్స్ షేర్లతో పాటు యలహంక ఇల్లు కూడా షర్మిల దేనని.. ఇది వైయస్సార్ స్వయంగా ఇచ్చిన ఆదేశమని ఆమె స్పష్టం చేశారు. కేవలం రాజకీయ కారణాలతో లేదా ఇతర విభేదాలతో తన చెల్లెలి పిల్లలకు రావాల్సిన ఆస్తులను జగన్ అడ్డుకోవడం ధర్మం కాదని ఆమె ఆ ప్రత్యేక న్యాయస్థానానికి పేర్కొన్నారు. షర్మిల అడుగుతోంది కేవలం తన పిల్లల భవిష్యత్తు కోసం ఆమెకు రావాల్సిన రాజ్యాంగబద్ధమైన వాటాయే తప్ప.. జగన్ ఇచ్చే బహుమతి కాదని కూడా తేల్చి చెప్పారు.జగన్ తన తల్లి మాటలను మన్నించి తన సోదరికి న్యాయం చేస్తారా? లేక ఈ వివాదం రాజకీయ రచ్చగా మారుతుందా? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. అయితే, రాజకీయ కారణాలు, ఇతర విభేదాల వల్ల ఆ ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు జగన్ ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించగా, అది తన హక్కు అని షర్మిల వాదిస్తున్నారు. ఇప్పుడు విజయమ్మ నేరుగా రంగంలోకి దిగి షర్మిల వైపు నిలబడటంతో ఈ వివాదం కొత్త మలుపు తిరిగింది.

# మంగళగిరి మోడల్ సాధ్యమేనా

గుంటూరు మార్చి 22

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో యువనేత, మంత్రి నారా లోకేష్ తన పనితీరుతో ఒక కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. గత ఎన్నికల్లో మంగళగిరి నుంచి రికార్డు మెజారిటీతో విజయం సాధించిన తర్వాత, నియోజకవర్గ అభివృద్ధి , ప్రజా సంక్షేమం విషయంలో ఆయన అనుసరిస్తున్న వ్యూహాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అయితే, లోకేష్ సృష్టిస్తున్న ఈ స్టాండర్డ్ ను అందుకోవడంలో సొంత పార్టీ ఎమ్మెల్యేలు మాత్రం వెనుకబడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నారా లోకేష్ మంగళగిరిలో కేవలం ఒక ఎమ్మెల్యేగా కాకుండా, ఒక వ్యవస్థగా ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. మంత్రిగా రాష్ట్రస్థాయి బాధ్యతల్లో అత్యంత బిజీగా ఉన్నప్పటికీ, తన నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అటు ఐటీ, విద్యాశాఖల మంత్రిగా సచివాలయంలో ఫైళ్లను క్లియర్ చేస్తూనే, ఇటు మంగళగిరిలోని పాఠశాలలకు ఆకస్మిక తనిఖీలకు వెళ్లడం, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయడం వంటి చర్యల ద్వారా గ్రౌండ్ లెవల్‌లో బలమైన ముద్ర వేస్తున్నారు. పర్యటనల్లో ప్రోటోకాల్ ఆడంబరాలు లేకుండా సామాన్యుడిలా ప్రజల మధ్యకు వెళ్లడం ఆయన పనితీరులోని ప్రత్యేకత.లోకేష్ తనను తాను ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుకుంటున్న తరుణంలో, టీడీపీలోని చాలామంది ఎమ్మెల్యేలు మాత్రం పాత ధోరణిలోనే సాగుతున్నారు. నియోజకవర్గాల అభివృద్ధి కంటే వ్యక్తిగత ఆధిపత్యం, స్థానిక వివాదాలు మరియు కాంట్రాక్టుల చుట్టూ కొందరు నేతలు తిరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. లోకేష్ తరహాలో టెక్నాలజీని వాడుకోవడం లేదా సోషల్ మీడియా ద్వారా ప్రజలతో నిరంతరం టచ్‌లో ఉండటం వంటి అంశాలను వీరు లైట్ తీసుకుంటున్నారు. ఫలితంగా, కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా, ఎమ్మెల్యేలు వివాదాల్లో చిక్కుకుంటున్నారు.లోకేష్ పనితీరును అందరూ అనుసరించాలని టీడీపీ హైకమాండ్ బహిరంగంగా ఆదేశాలు ఇస్తున్నట్లు కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేలను మోటివేట్ చేయడంలో మాత్రం పెద్దగా ఆసక్తి చూపడం లేదనే విశ్లేషణలు వస్తున్నాయి. బహుశా సీనియర్ ఎమ్మెల్యేల పనితీరును ఒక్కసారిగా మార్చడం సాధ్యం కాదన్న ఉద్దేశంతో అధిష్టానం ఉందేమో కానీ, లోకేష్ సాధిస్తున్న ఫలితాలను చూసైనా నేతలు మారాలన్న ఒత్తిడి క్యాడర్ నుంచి పెరుగుతోంది. లోకేష్ తన శాఖల్లో చూపిస్తున్న వేగాన్ని పార్టీ యంత్రాంగం మొత్తం అందిపుచ్చుకోలేకపోవడం ఒక లోపంగా కనిపిస్తోంది.రాజకీయాల్లో ఇప్పుడు వ్యక్తిగత ఇమేజ్ కంటే ప్రజాబలం ముఖ్యం. లోకేష్ తన ఇమేజ్‌ను మంగళగిరిలో చేసిన సేవా కార్యక్రమాల ద్వారా పెంచుకున్నారు. కానీ, చాలామంది ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో కేవలం ఎన్నికల సమయంలోనే కనిపిస్తారన్న ముద్రను చెరిపేసుకోలేకపోతున్నారు. లోకేష్ సెట్ చేసిన స్టాండర్డ్స్ ఒక రకంగా టీడీపీ నేతలకు సవాల్‌గా మారాయి. ఆయన వేగాన్ని తట్టుకుని నిలబడాలంటే, ఎమ్మెల్యేలు తమ పనితీరును సమూలంగా మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నారా లోకేష్ ఇప్పుడు 'నెక్స్ట్ జనరేషన్' లీడర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్నారు. కేవలం లోకేష్ ఒక్కరు కష్టపడితే సరిపోదని, పార్టీలోని ఎమ్మెల్యేలందరూ అదే స్థాయిలో కష్టపడితేనే 2029 ఎన్నికల నాటికి టీడీపీ మళ్ళీ తిరుగులేని శక్తిగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరి లోకేష్‌ను చూసి ఈ ఎమ్మెల్యేలు ఎప్పుడు చక్కబడతారో వేచి



## 8దేవాన్ష్ జన్మదినం శ్రీవారిని దర్శించుకున్న సీఎం చంద్రబాబు కుటుంబం

తిరుమల మార్చి 22

తిరుమలలో వేంకటేశ్వర స్వామిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయన కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ముఖ్యమంత్రి హోదా లో మహా ద్వారా ప్రవేశ అవకాశం ఉన్నా సామాన్య భక్తుల్లా శ్రీవారి దర్శనానికి సీఎం చంద్రబాబు కుటుంబం వచ్చింది. ఎప్పుడు శ్రీవారి దర్శనానికి వెళ్ళినా వైకుంఠం క్యూ కాంప్లెక్సు నుంచే అయన దర్శనానికి వెళ్తున్నారు. మనవడు దేవాన్ష్ జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీవారి దర్శనానికి సీఎం చంద్రబాబు కుటుంబం వచ్చింది. ముఖ్యమంత్రి వెంట ఆయన సతీమణి భువనేశ్వరి, మంత్రి లోకేష్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణి, దేవాన్ష్ వున్నారు.

శ్రీవారి దర్శనం అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నదాన కాంప్లెక్స్ లో అన్న ప్రసాద వితరణ చేసారు. ఒక్కరోజు అన్నదానానికి వ్యయం అయ్యే రూ.44 లక్షల విరాళాన్ని ఇప్పటికే అయన అందించారు. ఇప్పటికీ 12 మార్లు అన్నదానానికి ఎస్వీ అన్నదాన ట్రస్ట్ కు విరాళం సీఎం చంద్రబాబు ఇచ్చారు.

## మంటల్లో బస్సు దగ్ధం.. ప్రయాణికులు సురక్షితం

విజయనగరం మార్చి 22

విజయనగరం జిల్లాలో పెను ప్రమాదం తప్పింది. బస్సు వెనుక టైర్ పేలడంతో మంటలు చెలరేగాయి. భువనేశ్వర్ నుంచి మల్కన్ గిరికి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. టైర్ పేలగానే అప్రమత్తమైన డ్రైవర్, ప్రయాణికులను దించేశారు. మంటల ధాటికి బస్సు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో బస్సులో 37 మంది ప్రయాణికులు ఉన్నారు. ఐచీశీఅవ౧

## కొటి రూపాయల అటెండన్స్ వివాదం

హైదరాబాద్, మార్చి 22,సాధారణంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' ఆప్షన్ ఉంటుందని మనందరికీ తెలుసు. కానీ ఒక రాష్ట్రానికి ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉంటూ సభ గడప తొక్కకుండానే "అటెండెన్స్ అక్కర్లేని అసాధారణ ఉద్యోగి" గా కొత్త రికార్డు సృష్టించారు మన గులాబీ బాస్. 'రాజ్యం పోయినా రాచరికం పోలేదు' అన్న సామెతను నిజం చేస్తూ గజ్వేల్ ఫామ్ హౌస్ నుంచే ప్రజాస్వామ్యాన్ని శాసిస్తున్న తీరుపై ఇప్పుడు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు.సామాన్యుడు ఒక్క రోజు ఆఫీస్ మానేస్తే జీతంలో కోత పడుతుంది. కానీ మన ప్రతిపక్ష నేత గారికి మాత్రం ఇప్పటి వరకు అక్షరాలా రూ. 1.06 కోట్ల జీతభత్యాలు ప్రభుత్వం చెల్లించింది. సభకు వచ్చి ప్రజా సమస్యలపై గళం ఎత్తాల్సిన బాధ్యతను పక్కన పెట్టి, కేవలం అకౌంట్‌లో పడే మెసేజ్‌లకే పరిమితమైన ఈ 'రాజకీయం' చూసి సామాన్యులు నోరెళ్లబెడుతున్నారు. "కోటి రూపాయల జీతం తీసుకుంటూ కోలుకోలేని నిద్రలో ఉండటం" అంటే ఇదేనేమోనని చర్చించుకుంటున్నారు.శివప్రతాప్ శుక్లా అసెంబ్లీలో 'తెలంగాణ రైజింగ్ 2047' అంటూ భవిష్యత్ ప్రణాళికలు వివరిస్తుంటే.. ప్రధాన ప్రతిపక్షం మాత్రం "మేము రాము.. మాకు ఆ విజన్ డాక్యుమెంట్లు పట్టవు" అన్నట్లుగా వ్యవహరించింది. దీనిపై రేవంత్ సెటైర్ వేశారు. ఏఐ (ంఎ) సునామీ రాబోతోందని గవర్నర్ చెబితే, ప్రతిపక్షం మాత్రం ఇంకా పాత రికార్డులే వేస్తోంది. కనీసం విజన్ డాక్యుమెంట్ చదివారా? అంటే.. "మాకు అధికారం పోయిన దుఃఖం చదవడానికే టైమ్ సరిపోవడం లేదు" అన్నట్లుగా ఉందని ఎద్దేవాచేశాడు.నాలుగు కోట్ల మంది ప్రజలు తమ గొంతుక వినిపిస్తారని అసెంబ్లీ వైపు చూస్తుంటే, ప్రతిపక్ష నాయకుడు మాత్రం గవర్నర్‌కు కనీసం శుభాకాంక్షలు చెప్పడానికి కూడా రాలేదు. సభకు రాకుండా జీతం తీసుకోవడం అనేది ఒక "మాయని మచ్చ" అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అంటే విధులకు హాజరు కాకుండా జీతం తీసుకునే ఈ కొత్త ట్రెండ్‌పై ఇప్పుడు స్పెషల్ క్లాస్ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.అసెంబ్లీకి రాకుండా జీతం తీసుకోవడం అనేది 'కళ' అయితే.. అందులో కేసీఆర్ గారు 'ఆస్కార్' రేంజ్ పర్ఫార్మెన్స్ ఇస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెవులు కొరుక్కుంటున్నారు. మరి ఈ 'కోటి రూపాయల అటెండెన్స్' వివాదం ఎటు దారితీస్తుందో చూడాలి!

## వార్నింగ్ లతో సరి...

విజయవాడ, మార్చి 22

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో టీడీపీ వ్యవహార శైలి పై ఇటీవల చర్చలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా పార్టీ నేతల ప్రవర్తనపై ఆరోపణలు వస్తున్నప్పటికీ, వాటిపై కఠిన చర్యలు తీసుకోవడంలో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మృదువైన వైఖరిని అవలంబిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నాయకులు దారి తప్పుతున్నారని సమీక్షలు నిర్వహించడం, వారిని హెచ్చరించడం వరకే పరిమితమవుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఇటీవల ఏలూరు ( ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ వ్యవహారం ఈ చర్చకు మరింత బలం చేకూర్చింది. ఇప్పటికే 2024లో డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న ఆయనపై మరోసారి అదే విధమైన ఆరోపణలు రావడం పార్టీకి ఇబ్బందికర పరిస్థితిని తీసుకొచ్చింది. గతంలో కూడా ఈ విషయంపై సీరియస్‌గా స్పందించినట్టు ప్రకటించినప్పటికీ, వాస్తవానికి కఠిన చర్యలు తీసుకోకపోవడం ఇప్పుడు విమర్శలకు దారితీస్తోంది.చంద్రబాబు పాలనలో విజన్, అభివృద్ధి, పారదర్శకత వంటి అంశాలు ప్రాధాన్యం పొందుతున్నప్పటికీ, పార్టీ అంతర్గత వ్యవహారాల్లో మాత్రం క్రమశిక్షణ లోపిస్తున్నదన్న అభిప్రాయం వినిపిస్తోంది. ముఖ్యంగా ఎమ్మెల్యేలు ఎంపీలు మధ్య విభేదాలు బయటపడటం, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయి. క్షేత్రస్థాయిలో కూడా నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం కార్యకర్తల్లో అసంతృప్తిని పెంచుతోంది.ఈ పరిస్థితుల్లో కనీసం ఒక నాయకుడిపై అయినా కఠిన చర్యలు తీసుకుని ఉదాహరణ చూపించాల్సిన అవసరం ఉందని పార్టీ సీనియర్లు భావిస్తున్నారు. కానీ ప్రతి సారి "హెచ్చరించాం" అనే ప్రకటనలతో సరిపెట్టుకోవడం సమస్యను మరింత పెంచుతోందని అంటున్నారు. ఈ విధానం వల్ల నాయకులు తమ ప్రవర్తనను మార్చుకోవాలనే ఒత్తిడి అనుభవించడంలేదని కూడా అభిప్రాయపడుతున్నారు.ఇదే సమయంలో ప్రతిపక్షం వైసీపీ పై దాడి చేయాల్సిన పరిస్థితుల్లో, తమ పార్టీ లోపాలే ముందుకు రావడం టీడీపీకి ఇబ్బందిగా మారుతోంది. ఒకవైపు ప్రభుత్వ పనితీరు గురించి చెప్పుకోవాల్సిన సమయంలో, మరోవైపు నాయకుల వివాదాలు చర్చకు రావడం వల్ల పార్టీ ఇమేజ్‌పై ప్రభావం పడుతోంది.సీనియర్ నాయకులు సూచిస్తున్నది ఏమిటంటే, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై స్పష్టమైన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే క్రమశిక్షణను పునరుద్ధరించవచ్చని. సంఘటనలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే నియంత్రణ చర్యలు తీసుకోవాలని వారు



అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి చూస్తే, టీడీపీకి ప్రస్తుతం ఉన్న సవాలు కేవలం రాజకీయ ప్రత్యర్థులతో మాత్రమే కాదు, పార్టీ అంతర్గత వ్యవహారాలను సరిచేసుకోవడంలో కూడా ఉంది. ఈ పరిస్థితుల్లో నాయకత్వం తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో పార్టీ దిశను నిర్ణయించే అవకాశముంది.



## జనసేనతో బాలినేని

### కొలిక్కి వచ్చినట్టేనా


ఒంగోలు, మార్చి 22, ప్రకాశం జిల్లా రాజకీయాల్లో సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి చుట్టూ గత కొద్దిరోజులుగా నడుస్తున్న రాజకీయ ఉత్కంఠకు తెరపడింది. ఆయన జనసేనను వీడి తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) గూటికి చేరుతారనే ప్రచారానికి పవన్ కల్యాణ్‌తో జరిగిన భేటీతో చెక్ పడింది.ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో 'ఒంగోలు గిత్త'గా పేరుగాంచిన బాలినేని శ్రీనివాస రెడ్డి, ఎన్నికల అనంతరం వైసీపీని వీడి జనసేనలో చేరడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అయితే, గత వారం రోజులుగా ఆయన పార్టీ మారుతున్నారనే వార్తలు సోషల్ మీడియాలో, ముఖ్యంగా వైసీపీ అనుకూల మీడియా వర్గాల్లో జోరుగా ప్రచారమయ్యాయి.వార్తా సేవబాలినేని వైసీపీని వీడి జనసేనలో చేరినప్పటికీ, పాత పార్టీ నేతలతో ఆయనకు ఉన్న సంబంధాలు, ప్రకాశం జిల్లాలో మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో ఆయన అసంతృప్తిగా ఉన్నారనే వార్తలు పుట్టుకొచ్చాయి. "బాలినేని మళ్ళీ సొంత గూటికి" అనే శీర్షికలతో వైసీపీ సోషల్ మీడియా విభాగం పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించింది. జగన్ మోహన్ రెడ్డి పట్ల ఆయనకు ఉన్న సానుకూలతను అస్త్రంగా చేసుకుని, ఆయన జనసేనలో ఇమడలేకపోతున్నారనే సంకేతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరిగింది.అయితే అలాంటి ఊహాగానాలకు ముగింపు పలుకుతూ బుధవారం బాలినేని శ్రీనివాస రెడ్డి మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఆయన కుమారుడు ప్రణీత్ రెడ్డి కూడా పాల్గొనడం విశేషం. కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమే కాకుండా, జిల్లా రాజకీయాలు, భవిష్యత్తు కార్యాచరణపై పవన్‌తో ఆయన సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఇవాళ ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన విడుదల చేసిన పోస్టర్లలో పవన్ కల్యాణ్ ఫోటోను ప్రముఖంగా ఉంచడం ద్వారా, తాను జనసేనలోనే కొనసాగుతున్నాననే స్పష్టమైన సందేశాన్ని కేడర్‌కు, ప్రత్యర్థి పార్టీలకు పంపారు.బాలినేని పార్టీ మారుతున్నారనేది వైసీపీ ఆడుతున్న 'మైండ్ గేమ్' అని ఆయన వర్గీయులు చెప్తున్నారు. జిల్లాలో జనసేన బలపడకుండా చూసేందుకు, కార్యకర్తల్లో గందరగోళం సృష్టించేందుకే ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తున్నారని వారు మండిపడుతున్నారు. ఒక సీనియర్ నేత పార్టీ మారి, మళ్ళీ వెనక్కి వస్తున్నారనే ప్రచారం ద్వారా జనసేన ప్రతిష్టను తగ్గించాలనుకుంటున్నారని చెప్తున్నారు. బాలినేని వెంట వచ్చిన అనుచరుల్లో అభద్రతా భావాన్ని నింపాలనుకుంటున్నారనేది వారి ఆరోపణ.వార్తా సేవప్రకాశం జిల్లాలో బాలినేనికి బలమైన కేడర్ ఉంది. ఆయన జనసేనలో ఉండటం కూటమికి పెద్ద ప్లస్ పాయింట్.

ఒకవేళ ఆయన నిజంగానే వెనుదిరిగితే జిల్లాలో జనసేన డీలా పడే అవకాశం ఉండేది. కానీ, తాజా భేటీతో జనసైనికుల్లో కొత్త ఉత్సాహం వచ్చింది. పవన్ కల్యాణ్ కూడా బాలినేని అనుభవాన్ని జిల్లా అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి వాడుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం.రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజం. కానీ, ఒక నాయకుడి వ్యక్తిగత నిర్ణయాలపై సాగే తప్పుడు ప్రచారం తాత్కాలికంగా గందరగోళం సృష్టించినా, వాస్తవాలు వెలుగులోకి వచ్చినప్పుడు అది సదరు ప్రచారం చేసిన పార్టీకే నష్టం చేకూరుస్తుంది. బాలినేని శ్రీనివాస రెడ్డి పవన్ కల్యాణ్‌ను కలవడంతో ప్రకాశం జిల్లా రాజకీయాల్లో నెలకొన్న నీలినీడలు తొలగిపోయాయి. ఆయన తన రాజకీయ భవిష్యత్తును జనసేనతోనే ముడివేసుకున్నారని ఈ భేటీతో రూఢీ అయింది.

## పాలిటిక్స్ లోకి నారా రోహిత్...

తిరుపతి,మార్చి 22,

తెలుగుదేశం పార్టీ అంటే ముందుగా గుర్తొచ్చే పేర్లు నందమూరి, నారా కుటుంబాల వారివి. తెలుగుదేశం పార్టీని స్థాపించి 9 నెలల కాలంలోనే అధికారంలోకి తీసుకు రాగలిగారు నందమూరి తారక రామారావు. అయితే చంద్రబాబు ఆ పార్టీకి సుదీర్ఘకాలం అధ్యక్షుడిగాను వ్యవహరించారు. నాలుగు దశాబ్దాల పాటు ఆ పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో చంద్రబాబు పాత్ర మరువరానిది. అయితే ఇప్పుడు ఆ పార్టీకి భవిష్యత్తు నాయకుడు లోకేష్ అనడంలో సందేహం లేదు. తనను తాను ప్రూవ్ చేసుకొని ముందుకు సాగుతున్నారు లోకేష్. తెలుగుదేశం పార్టీని అనధికారిక అధ్యక్షుడిగా కొనసాగుతూ.. పార్టీని సమన్వయం చేసుకోవడమే కాదు బలోపేతం చేయడంలో లోకేష్ ముందుంటున్నారు. అదే సమయంలో నందమూరి కుటుంబం నుంచి బాలకృష్ణ తెలుగుదేశం పార్టీలో యాక్టివ్ గా ఉన్నారు. అయితే ఇప్పుడు నారా కుటుంబం నుంచి మరో యువ నేత రంగంలోకి వస్తారని ప్రచారం నడుస్తోంది. సినీ నటుడు నారా రోహిత్ పొలిటికల్ ఎంట్రీ ఉంటుందని ప్రచారం జోరుగా సాగుతోంది. అందుకు బలం చేకూరుస్తూ ఆయన సైతం ఫుల్ క్లారిటీ ఇచ్చారు.చంద్రబాబు నాయుడుసోదరుడిగా రామ్మూర్తి నాయుడు ఉండేవారు. ఆయన ఒకసారి చంద్రగిరి నుంచి ఎమ్మెల్యేగా కూడా గెలిచారు. చాలా రోజులపాటు అనారోగ్యంతో బాధపడుతూ గత ఏడాది చనిపోయారు రామ్మూర్తి నాయుడు. ఆయన కుమారుడే నారా రోహిత్. తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సాధించుకున్నారు. అయితే ఇంతవరకు ఆయనకు సినిమా రంగంలో సరైన బ్రేక్ తగలలేదు. మొన్ననే వివాహం చేసుకొని ఒక ఇంటి వాడు అయ్యాడు. అయితే తనకు రాజకీయ ఆసక్తి ఉందని తాజాగా వెల్లడించాడు. నారా రామ్మూర్తి నాయుడు జయంతి వేడుకలు ఆయన సొంత గ్రామం నారావారి పల్లెలో జరిగాయి. తండ్రికి నివాళులు అర్పించేందుకు నారా రోహిత్ వెళ్లారు. పొలిటికల్ ఎంట్రీ ఎప్పుడు ఉంటుందా అని మీడియా ప్రతినిధులు



అడిగితే.. కచ్చితంగా ఉంటుందని ఆయన చెప్పారు. తనకు రాజకీయాలు అంటే ఇష్టంగా పేర్కొన్నారు. సరైన సమయంలో పొలిటికల్ ఎంట్రీ ఇస్తానని కూడా చెప్పుకొచ్చారు.నారా రామ్మూర్తి నాయుడు అనారోగ్యానికి గురికావడంతో నారా రోహిత్ బాధ్యతలను ఎక్కువగా చంద్రబాబు చూసుకున్నారు. ఆయన పొలిటికల్ గా బిజీగా ఉండడంతో పెద్దమ్మ భువనేశ్వరి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మొన్న రోహిత్ వివాహంలో కూడా భువనేశ్వరి అన్ని తానై వ్యవహరించారు. పెదనాన్న చంద్రబాబు, సోదరుడు లోకేష్ తో రోహిత్ కు మంచి సంబంధాలు ఉన్నాయి. 2024 ఎన్నికల్లో టిడిపి కూటమికి మద్దతుగా రోహిత్ ప్రచారం కూడా చేశారు. లోకేష్ తెలుగుదేశం పార్టీ నాయకత్వ బాధ్యతలు తీసుకుంటే కుటుంబ పరంగా ఆయనకు మద్దతు అవసరం. అందుకే నారా రోహిత్ పొలిటికల్ ఎంట్రీ కి సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఆయన చంద్రగిరి నుంచి బరిలో దిగుతారని నారా అభిమానులు భావిస్తున్నారు. అయితే ప్రత్యక్ష ఎన్నికల్లోనే కాకుండా పార్టీ పరంగా కూడా నారా రోహిత్ సేవలను టిడిపి నాయకత్వం తీసుకునే ఛాన్స్ కనిపిస్తోంది. పెదనాన్న చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన మరుక్షణం టిడిపిలో యాక్టివ్ అయ్యేందుకు నారా రోహిత్ సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

## జగన్‌కు మారుతున్న వ్యూహకర్తలు

విజయవాడ, మార్చి 22



వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రస్తుతం తన రాజకీయ ప్రస్థానంలో అత్యంత కీలకమైన వ్యూహకర్తల సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. గత ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత, పార్టీని గాడిలో పెట్టేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఒక కొలిక్కి రావడం లేదు. 2019లో అఖండ విజయానికి కారకుడైన ప్రశాంత్ కిషోర్‌ను దూరం చేసుకున్న ఐప్యాక్ పై భారం వేసిన జగన్, ఫలితాల తర్వాత వారిని పూర్తిగా పక్కన పెట్టేశారు. ఎన్నికలకు ముందు ఐప్యాక్ కార్యాలయానికి వెళ్లి మనం సుదీర్ఘ కాలం కలిసి ప్రయాణం చేద్దాం అని చెప్పిన జగన్, ఫలితాల షాక్‌తో నిర్ణయాన్ని మార్చుకున్నరా?.ఐప్యాక్ నిష్క్రమణ తర్వాత వైసీపీ శిబిరంలో పలువురు వ్యూహకర్తల పేర్లు వినిపించాయి. ముఖ్యంగా బీజేపీ కోసం పనిచేసిన అనుభవం ఉన్న శంతను సింగ్ వంటి వారిని లైన్‌లోకి తెచ్చినట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత మరికొందరు జాతీయ స్థాయి కన్సల్టెంట్లను సంప్రదించినా, జగన్ తీరు , ఆయన ఆలోచనా విధానానికి అనుగుణంగా ఎవరూ ఇమడలేకపోతున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. తాజాగా ఈషా సింగ్ అనే యువ వ్యూహకర్త పేరు తెరపైకి వచ్చింది. ఈమె గతంలో పలువురు ప్రముఖులకు సోషల్ మీడియా, పొలిటికల్ బ్రాండింగ్ విభాగాల్లో పనిచేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె నేతృత్వంలో వైసీపీకి కొత్త ఇమేజ్ ఇచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం.జగన్ మోహన్ రెడ్డి మనస్తత్వం ప్రకారం ఆయన ఒకసారి నమ్మితే పూర్తి బాధ్యతలు అప్పగిస్తారు, కానీ ఆశించిన ఫలితాలు రాకపోతే అంతే వేగంగా నిర్ణయాలు తీసుకుంటారు. ఆయనకు కేవలం డేటా మాత్రమే కాదు, తన వ్యక్తిత్వాన్ని , క్షేత్రస్థాయి క్యాడర్ భావోద్వేగాలను ప్రతిబింబించే వ్యూహాలు కావాలి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వ్యూహకర్తలు కేవలం సోషల్ మీడియా మేనేజ్‌మెంట్‌కు పరిమితమవుతున్నారే తప్ప, ప్రత్యర్థి కూటమిని ఢీకొట్టే బలమైన రాజకీయ అజెండాను సృష్టించడంలో విఫలమవుతున్నారనే అభిప్రాయం ఉంది.ప్రస్తుత గందరగోళ పరిస్థితుల్లో, కొత్తవారు ఎవరూ నిలదొక్కుకోలేకపోతుండటంతో.. వైసీపీ చివరకు తన పాత మిత్రుడు ప్రశాంత్ కిషోర్ వైపే మళ్ళీ మొగ్గు చూపే అవకాశం ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అప్పట్లో పీకే ఇచ్చిన క్షేత్రస్థాయి రిపోర్టులు, అభ్యర్థుల ఎంపికలో ఆయన సలహాలు జగన్‌కు బాగా కలిసి వచ్చాయి. ఒకవేళ కొత్త టీమ్‌లు ఆశించిన స్థాయిలో పార్టీని పుంజుకునేలా చేయలేకపోతే, రాబోయే రోజుల్లో మిషన్ 2029 కోసం జగన్ మళ్ళీ పీకే శిబిరాన్ని ఆశ్రయించినా ఆశ్చర్యపోనక్కర్లేదని చెబుతున్నారు. అయితే పీకే ఆసక్తి చూపిస్తారా అన్నది మాత్రం చెప్పడం కష్టమే.

# చక్రం తిప్పుతున్న కరీంనగర్ నేతలు

కరీంనగర్, మార్చి 22

కరీంనగర్ అంటేనే ఉద్యమాల గడ్డ. నాడు భూస్వాములపై తిరుగుబాటు చేసినా.. తర్వాత రజాకార్లపై తిరగబడినా.. తొలితరం తెలంగాణ ఉద్యమమైనా? మలిదశ తెలంగాణ పోరాటమైనా.. జగిత్యాల జైత్రయాత్ర అయినా.. నక్సల్ ఉద్యమమైనా.. తర్వాత జరిగిన మావోయిస్టు ఉద్యమమైనా కరీనంగర్ వాసులు ఉండాల్సిందే. తాజాగా రాజకీయాల్లోనూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలు రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకుంటున్నారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. కేంద్రం, రాష్ట్ర స్థాయిలో జిల్లా నేతలకు కీలక పదవులు దక్కాయి.. దక్కుతున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలలో ఈ ప్రాంతం ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.కరీంనగర్ నుంచి బండి సంజయ్ కేంద్ర మంత్రిగా ఉన్నారు. కీలకమైన హోంశాఖ సహాయ మంత్రిగా మోదీ 3.0 క్యాబినెట్‌లో స్థానం దక్కించుకున్నారు. తెలంగాణలో పార్టీని బలోపేతం చేసినందుకు ఆయనకు దక్కిన గుర్తింపు, గౌరవంగా చెప్పొచ్చు. ఇక తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత జిల్లాకు మూడు మంత్రి పదవులు దక్కాయి. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కీలకమైన ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రిగా ఉన్నారు. పొన్నం ప్రభాకర్ బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రిగా, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు.ఇక అధికార కాంగ్రెస్‌కు చెందిన వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు విప్ పదవి దక్కింది. తన పదవికి తగినట్లుగా ఆయన కార్యదక్షత చూపుతున్నారు. తాజాగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను కూడా విప్ పదవులు వరించాయి. దీంతో అసెంబ్లీలో కరీంనగర్ శక్తి మరింత పెరిగింది. ఇక మానకొండూర్ ఎమ్మెల్యే కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. ఇక బీఆర్ఎస్‌లో కేటీఆర్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బీజేపీలో కీలక నాయకుడిగా ఉన్నారు. ఈ పదవులు మూడు పార్టీల్లో కరీంనగర్ జిల్లా బలాన్ని నిరూపిస్తున్నాయి. కరీంనగర్ ప్రాంతం రాజకీయంగా చురుకైన మట్టి కలిగి ఉంది. స్థానిక నాయకులు పార్టీలకు అంకితమై, గ్రామీణ?పట్టణ ప్రజల మద్దతుతో ఎదిగారు. బండి సంజయ్‌కు యువతలో మంచి పట్టు ఉంది. కేటీఆర్ టెక్నాలజీలో యువ ఉద్యోగులను ఆకట్టుకుంటున్నారు. ఈ ట్రెండ్ రాష్ట్ర రాజకీయాలకు కొత్త ఊపు ఇస్తూ, జిల్లాను 'పవర్‌హౌస్'గా మార్చుతోంది.ప్పటికే రెండున్నరేళ్ల పాలన పూర్తి కావొస్తోంది. ఎన్నికలకు ఇంకో రెండున్నరేళ్లే ఉన్నట్లు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ఆశావహులు పదవుల కోసం కాంగ్రెస్ పెద్దలపై ప్రెజర్ పెడుతున్నారు. ప్రభుత్వ పెద్దలు కూడా క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న రెండు బెర్తులతో మిగిలిపోయిన నామినేటెడ్ పోస్టులు, విప్ పదవుల భర్తీపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే బడ్జెట్ సెషన్ వేళ అసెంబ్లీ, శాసన మండలిలో విప్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అసెంబ్లీలో కొత్తగా ముగ్గురు విప్‌లకు అవకాశం కల్పించారు.

**ఇద్దరు విప్‌లకు ప్రమోషన్..**

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో పాటు ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్‌ను విప్‌లుగా నియమించారు. శాసనమండలిలో విప్‌లు లేకపోవడంతో అద్దంకి, బల్మూర్ వెంకట్‌కు అవకాశం దక్కినప్పటికీ..శాసనసభలో మాత్రం ఆల్రెడీ ముగ్గురు విప్‌లు ఉండగా..ఆల్ ఆఫ్ సడెన్‌గా మరో ముగ్గురిని విప్‌లుగా నియమించడంపై సరికొత్త చర్చ జరుగుతోంది.గతంలో విప్‌లుగా నలుగురికి అవకాశం ఇచ్చారు. అందులో ఇద్దరు విప్‌లకు ప్రమోషన్ లభించింది. మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్‌కు అవకాశం దక్కగా..రామచంద్రు నాయక్‌కు డిప్యూటీ స్పీకర్‌గా అవకాశం కల్పించారు. కానీ ఇంకా రామచంద్రు నాయక్ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు తీసుకోలేదు. ప్రస్తుతం ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య విప్‌లుగా ఉండగా..కొత్తగా ముగ్గురికి అవకాశం ఇచ్చారుకొత్తగా ఒకేసారి ముగ్గురికి విప్‌లుగా అవకాశం ఇవ్వడం వెనుక..ప్రభుత్వ పెద్దల ఆలోచన మరొకటి ఉందనే టాక్ వినిపిస్తోంది. ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికే రెండున్నరేళ్లు పూర్తి కావస్తోంది. ఇక మిగిలింది మరో రెండున్నర ఏళ్లు మాత్రమే. ఇక మును ముందు రానున్న కాలం ప్రభుత్వానికి అత్యంత కీలకం అని చెప్పొచ్చు. అసెంబ్లీలో ప్రతిపక్షాలు వాయిస్ మరింత పెంచే అవకాశం ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై నిలదీసేందుకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ వ్యూహాలు రచిస్తోంది. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ ప్రభుత్వంపై ఒత్తిడి పెరగడం ఖాయం. దీంతో అసెంబ్లీ వేదికగా ప్రభుత్వంపై జరిగే దాడిని సమర్థవంతంగా తిప్పి కొట్టాలనే ఆలోచనతో విప్‌ల సంఖ్య పెంచారనే టాక్ వినిపిస్తుంది.ఇక విప్‌లుగా పనిచేస్తున్న వారికి కూడా ప్రమోషన్ లభించే అవకాశం ఉందనే చర్చ జరుగుతుంది. గతంలో ఇద్దరికి ప్రమోషన్ దక్కగా..మరో ఇద్దరు కూడా ప్రమోషన్ కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య ఇద్దరు కూడా మంత్రివర్గంలో ఛాన్స్ కోసం ఆశలు పెట్టుకున్నారు. సామాజిక సమీకరణాలలో భాగంగా తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. మున్నూరు కాపు సామాజిక వర్గం నుంచి అవకాశం ఇవ్వాలని ఆది శ్రీనివాస్ చాలా కాలం నుంచి కోరుతున్నారు. తెలంగాణలో..ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో మున్నూరు కాపు బలమైన సామాజిక వర్గం కావడంతో..తమ వర్గానికి క్యాబినెట్ లో ప్రాతినిధ్యం కల్పించాలని..ఆ వర్గం నేతలు కూడా పార్టీ పెద్దలను డిమాండ్ చేస్తున్నారు. అలాగే బీర్ల అయిలయ్య కూడా యాదవ సామాజిక వర్గం నుంచి తనకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని కొంత కాలంగా

# కన్నీరు పెడుతున్న మంజీరమ్మ

మెదక్, మార్చి 22,

సంగారెడ్డి జిల్లాలో మంజీరమ్మ కన్నీరు పెడుతోంది .ఒకప్పుడు జీవకళతో ఉట్టిపడిన నది, ఇప్పుడు పారిశ్రామిక వ్యర్థాలతో విషతుల్యంగా మారింది. ముఖ్యంగా నక్కవాగు ద్వారా వస్తున్న రసాయన జలాలు మంజీర నదిని మృత్యుకూపంగా మారుస్తున్నాయి. హత్నూర మండలం పల్పనూరు, ఫసల్వాడి, గౌడిచర్ల పరిసరాల్లో వేల సంఖ్యలో చేపలు మృత్యువాత పడటం కలకలం రేపుతోంది. వేల సంఖ్యలో చేపల మృతితో మత్స్యకారులు లబోదిబోమంటున్నారు.సంగారెడ్డి జిల్లా మత్స్యకారుల బతుకు చిత్రం ఛిన్నాభిన్నమవుతోంది. నక్కవాగు రూపంలో వస్తున్న పారిశ్రామిక వ్యర్థాలు మంజీర నదిని కలుషితం చేస్తున్నాయి. పారిశ్రామిక వాడల నుండి వెలువడే రసాయన జలాలను నేరుగా వాగులోకి వదలడంతో, ఆ విషతుల్యమైన నీరు మంజీరలో కలిసి మత్స్య సంపదను హరించివేస్తోంది. నేడు చేపల వేటకు వెళ్లిన పల్పనూరు, ఫసల్వాడి, గౌడిచర్ల గ్రామస్థులకు నదిలో కుప్పలు తెప్పలుగా పడి ఉన్న మృత చేపలు దర్శనమిచ్చాయి..గతంలోనూ ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయి. చేపలు చనిపోయిన ప్రతిసారీ అధికారులు వస్తారు, నమూనాలు సేకరిస్తారు. కానీ యాక్షన్ మాత్రం శూన్యమని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నక్కవాగు పరిసర గ్రామాల ప్రజలు ఈ నీటిని తాగలేక, వాడలేక నానా అవస్థలు పడుతున్నారు. కంపెనీల యాజమాన్యాలు లాభాల కోసం చూస్తూ, వ్యర్థాలను శుద్ధి చేయకుండానే నదిలోకి వదులుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీస్తున్న ఈ కాలుష్య కోరల నుండి మంజీరను కాపాడేవారే లేరా అని ప్రశ్నిస్తున్నారు.

## అజార్ త్యాగయ్యేనా

# మెడమీద వేళాడుతున్న కత్తి

హైదరాబాద్, మార్చి 22

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం మాజీ క్రికెటర్, ప్రస్తుత మంత్రి మహ్మద్ అజారుద్దీన్ ఎమ్మెల్సీ నియామక అంశం హాట్ టాపిక్‌గా మారింది. మంత్రివర్గంలో సభ్యుడిగా ఉండి, ఏ సభలోనూ సభ్యత్వం లేని మహ్మద్ అజారుద్దీన్ రాజకీయ భవిష్యత్తు ఇప్పుడు ఒక క్లిష్ట దశకు చేరుకుంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆరు నెలలలోపు శాసనసభ శాసనమండలి సభ్యుడిగా ఎన్నిక కావాల్సి ఉంటుంది. అజారుద్దీన్ గడువు ఏప్రిల్ ఆఖరుతో ముగుస్తుండటంతో, ఆయన పదవిపై సందిగ్ధత నెలకొంది.గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన అజారుద్దీన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఆయనను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ఈ ప్రక్రియ ప్రారంభం నుంచీ అనేక న్యాయపరమైన, రాజకీయపరమైన చిక్కులను ఎదుర్కొంటోంది. మొదట ప్రొఫెసర్ కోదండరాం, అమేర్ అలీఖాన్‌ల పేర్లను గవర్నర్ కోటా కింద సిఫార్సు చేయగా, గత ప్రభుత్వం నియమించిన అభ్యర్థుల తిరస్కరణపై సుప్రీంకోర్టులో కేసు దాఖలైంది. దీంతో ప్రభుత్వం తన ప్రతిపాదనలను మార్చాల్సి వచ్చింది. రెండోసారి కోదండరాంతో పాటు అజారుద్దీన్ పేరును ప్రభుత్వం సిఫార్సు చేసింది.సుప్రీంకోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉన్నందున గత గవర్నర్ ఈ ఫైల్‌పై నిర్ణయం తీసుకోలేదు. అయితే, ఫిబ్రవరి 3న సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేస్తూ, గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని, కోర్టు విచారణ దానికి అడ్డంకి కాదని స్పష్టం చేసింది. దీంతో అజారుద్దీన్ ఎమ్మెల్సీ నియామకం సుగమం అవుతుందని ప్రభుత్వం భావించినా, అప్పటి గవర్నర్ బదిలీ కావడంతో ఫైల్ మళ్లీ పెండింగ్‌లోకి వెళ్లింది. ప్రస్తుతం కొత్త గవర్నర్ ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.ఏప్రిల్ నెలాఖరు లోపు అజారుద్దీన్ ఎమ్మెల్సీగా ప్రమాణం చేయకపోతే, ఆయన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఇది ప్రభుత్వానికి నైతికంగా ఇబ్బందికరంగా మారుతుంది. ఒకవైపు అజారుద్దీన్ నియామకం పెండింగ్‌లో ఉండగానే, రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు ఉంటాయనే ప్రచారం జోరందుకుంది. ముఖ్యంగా లంబాడా వర్గం నుంచి ఒకరికి మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చినప్పటికీ అమలు కాకపోవడంతో, బాధితులు హైకోర్టును ఆశ్రయించవచ్చని న్యాయస్థానమే సూచించింది. దీంతో ఈ వ్యవహారం మళ్లీ న్యాయపోరాటంగా మారే అవకాశం ఉంది.ఒకవేళ గడువులోగా గవర్నర్ ఆమోద ముద్ర వేయకపోతే, అజారుద్దీన్ తన మంత్రి పదవిని కోల్పోవడమే కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసే అవకాశం ఉంది. బడ్జెట్ సమావేశాల అనంతరం లేదా ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాతే ఈ విషయంలో స్పష్టత వచ్చే సూచనలు కనిపిస్తున్నాయిః

# టిక్కెట్ లేని ప్రయాణికుల నుంచి రూ.223 కోట్ల వసూళు

హైదరాబాద్, మార్చి 22

దక్షిణ మధ్య రైల్వే ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో టికెట్ తనిఖీ ప్రక్రియలో రూ. 223.60 కోట్ల రికార్డు ఆదాయాన్ని రాబట్టినట్లు రైల్వే అధికారులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రైల్వే బోర్డు నిర్దేశించిన రూ . 221.08 కోట్ల లక్ష్యాన్ని, సంవత్సరం ముగియడానికి 14 రోజుల ముందే ఈ జోన్ అధిగమించింది. ఏ ఆర్థిక సంవత్సరంలోనైనా టికెట్ తనిఖీ ద్వారా వచ్చిన అత్యధిక ఆదాయం ఇదే కావడం విశేషం. ఇంతకు ముందు 2023-24 సంవత్సరం లో రూ . 220.81 కోట్ల ఆదాయం వచ్చింది.

టికెట్ లేని ప్రయాణం, ముందుగా బుక్ చేయని లగేజీ మొదలైన వాటిపై నమోదైన కేసుల ద్వారా ఈ ఆదాయం ఆర్జించినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ జోన్ ప్రస్తుత సంవత్సరంలో, 2025 అక్టోబర్ 18 న ఒకే రోజులో టికెట్ తనిఖీ ద్వారా రూ . 1.85 కోట్ల రికార్డు ఆదాయాన్ని ఆర్జించింది. రైల్వేలలో టిక్కెట్ల తనిఖీ అనేది, టిక్కెట్టు లేని, సరైన ఆధారాలు లేకుండా చేసే ప్రయాణాలను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది అలవాటుగా ప్రతినిత్యం టిక్కెట్లు లేకుండా ప్రయాణం చేసేవారిని నిరోదిస్తూ, బుకింగ్ విండోల ద్వారా టిక్కెట్ల అమ్మకాలు పెరగడానికి దోహదపడు తుంది.రైలు ప్రయాణంలో అధీకృత టిక్కెట్ లేదా ప్రయాణ పత్రం కలిగి ఉండటం ప్రాముఖ్యత గురించి సాధారణ ప్రజలలో అవగాహన కల్పించడానికి కూడా ఇది సహాయపడుతుందని రైల్వే అధికారులు తెలిపారు.

# టీజేపీకి లైన్ క్లియర్

హైదరాబాద్, మార్చి 22,




తెలంగాణ రాజకీయాల్లో గత దశాబ్ద కాలంగా కీలక పాత్ర పోషించిన మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఇప్పుడు సరికొత్త అధ్యాయానికి తెరలేపారు. 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో ఆమె కొత్త రాజకీయ పార్టీని స్థాపించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ మేరకు పార్టీ నమోదు ప్రక్రియను కవిత ప్రారంభించారు. సాధారణంగా రాజకీయ పార్టీల నమోదు ప్రక్రియ కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలో సాగుతుంది. అయితే, తన దరఖాస్తుపై ఈసీఐ వేగంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతూ కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది.జనవరి 23న 'తెలంగాణ ప్రజా జాగృతి' పార్టీ నమోదు కోసం ఈసీఐకి దరఖాస్తు చేశారు కవిత. ఫిబ్రవరి 23న దరఖాస్తులో సాంకేతిక లోపాలు ఉన్నాయంటూ ఈసీఐ తిరుగు టపా పంపింది. మార్చి 19న దిల్లీ హైకోర్టులో ఈ పిటిషన్‌పై కీలక విచారణ జరగనుంది. ఈ న్యాయపోరాటం ద్వారా పార్టీని సాధ్యమైనంత త్వరగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కవిత భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది.గతంలో 'తెలంగాణ జాగృతి' అనే సాంస్కృతిక సంస్థ ద్వారా బతుకమ్మ పండుగను విశ్వవ్యాప్తం చేయడంలో కవిత విజయవంతమయ్యారు. ఇప్పుడు దాదాపు అదే పేరును రాజకీయ పార్టీగా మార్చడం వెనుక సెంటిమెంట్, బ్రాండ్ వాల్యూ రెండూ ఉన్నాయి. తెలంగాణ అస్తిత్వం, సంస్కృతి ప్రాతిపదికన తన రాజకీయ భవిష్యత్తును పునర్నిర్మించు కోవాలనేది ఆమె ఆలోచనగా కనిపిస్తోంది.పార్టీ నమోదు విషయంలో ఈసీఐ లేవనెత్తిన లోపాలు ఇప్పుడు ప్రధాన అడ్డంకిగా మారాయి. రాజకీయ పార్టీ నమోదుకు ఉండాల్సిన నిబంధనలు చాలా కఠినంగా ఉంటాయి. నిధుల సమీకరణ, పార్టీ రాజ్యాంగం, సభ్యత్వ వివరాల్లో స్పష్టత ఉండాలి. హైకోర్టు ఈ విషయంలో ఈసీఐకి ఎలాంటి దిశానిర్దేశం చేస్తుందనేది పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది.బీఆర్ఎస్ పార్టీలో కేసీఆర్, కేటీఆర్ నీడలో కాకుండా, తనకంటూ ఒక ప్రత్యేక రాజకీయ వేదిక ఉండాలని ఆమె ఆశిస్తున్నారు. మహిళా సాధికారత, తెలంగాణ హక్కులే ప్రధాన ఎజెండాగా ఈ పార్టీ పనిచేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆమె ఎదుర్కొంటున్న లిక్కర్ స్కామ్ కేసుల నేపథ్యంలో, రాజకీయంగా యాక్టివ్‌గా ఉండటం ద్వారా ఆ ఆరోపణలను ఎదుర్కోవాలని ఆమె యోచిస్తున్నారు. జాగృతి సంస్థకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నెట్‌వర్క్‌ను నేరుగా రాజకీయ శక్తిగా మార్చడం ఈ పార్టీ ఉద్దేశ్యం'తెలంగాణ ప్రజా జాగృతి' ఆవిర్భావం తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీయవచ్చు. యితే సాంకేతిక లోపాలను సవరించు కోకుండా.. కవిత కోర్టుకు వెళ్లడం ఏమిటన్న విస్మయం వ్యక్తమవుతోంది. ఆ సాంకేతిక లోపాలు పరిష్కరించలేనివి అయితే తప్ప ఇలా చేయరని.. భావిస్తున్నారు. కవిత ఇప్పుడు ఆ సాంకేతిక సమస్యలను పరిష్కరించుకుంటే తప్ప.. రిజిస్ట్రేషన్ పూర్తి కాదు. ఎలాగోలా నెల రోజుల్లో పూర్తి చేసి తన పార్టీని ప్రకటించాలని కవిత ప్రయత్నిస్తున్నారు.కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌కు ఇది అనుబంధ శక్తిగా మారుతుందా లేదా కవిత స్వతంత్ర గళాన్ని వినిపిస్తారా అనేది వేచి చూడాలి. ప్రస్తుతానికి దిల్లీ హైకోర్టు ఇచ్చే తీర్పు ఈ కొత్త పార్టీ ప్రస్థానానికి పునాది కానుంది.

# రేవంత్ వ్యూహాల ముందు...

## కేటీఆర్ ఆత్మరక్షణ

హైదరాబాద్, మార్చి 22



తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చ, అధికార కాంగ్రెస్ , ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఒక రసవత్తర యుద్ధానికి వేదికైంది. అయితే, ఈ పోరులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో విరుచుకుపడుతూ బీఆర్ఎస్ శ్రేణులను ఆత్మరక్షణలో పడేశారు. ముఖ్యంగా కేటీఆర్ వంటి వారు ఉన్నప్పటికీ, రేవంత్ రెడ్డిని ధీటుగా ఎదుర్కోవడంలో బీఆర్ఎస్ విఫలమైంది. రేవంత్ రెడ్డి అటు రాజకీయ విమర్శలతో పాటు, ఇటు పాలనాపరమైన అంశాలను కూడా ప్రస్తావిస్తూ గులాబీ పార్టీని ఇరకాటంలో పెట్టారు.ఈ చర్చలో కేటీఆర్ ప్రసంగం అంతా పాత ఆరోపణల చుట్టూనే తిరిగింది. ఆరు గ్యారెంటీల అమలు, రుణమాఫీ వంటి అంశాలపై ఆయన చేసిన విమర్శలను మంత్రులు అప్పటికప్పుడు తిప్పికొట్టారు. ముగిసిన అధ్యాయం లాంటి అంశాలను మళ్ళీ మళ్ళీ ప్రస్తావించడం వల్ల ప్రజల్లోకి వెళ్లాల్సిన గట్టి సందేశం పలచబారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు, రేవంత్ రెడ్డి అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని లోపాలను ఎండగడుతూనే, తమ ప్రభుత్వం భవిష్యత్తులో చేయబోయే పనులపై తెలంగాణ రైజింగ్-2047 వంటి విజన్ డాక్యుమెంట్లను ప్రస్తావించి సభను తన వైపు తిప్పుకున్నారు.ముఖ్యంగా మూసీ పునరుజ్జీవనంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను రేవంత్ రెడ్డి అత్యంత చాకచక్యంగా తిప్పికొట్టారు. గతంలో కేసీఆర్, కేటీఆర్ మూసీ నదిపై చేసిన వ్యాఖ్యల తాలూకు వీడియోలను సభలో ప్రదర్శించి, వారి ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. అక్రమ కట్టడాలను బుల్డోజర్లతో కూల్చాలని అప్పుడు చెప్పింది మీరు కాదా అని రేవంత్ ప్రశ్నించినప్పుడు, బీఆర్ఎస్ సభ్యుల దగ్గర సరైన సమాధానం లేకపోయింది. కేటీఆర్ కేవలం సోషల్ మీడియా వేదికగా చేసే విమర్శలను సభలోనూ పునరావృతం చేయడం వల్ల, రేవంత్ వేసిన ప్రత్యూహాల ముందు అవి నిలబడలేకపోయాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేటీఆర్ ఎప్పటిలాగే తక్కువ అంచనా వేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని భావిస్తున్నారు. రేవంత్ రెడ్డి కేవలం వాక్చాతుర్యంతోనే కాకుండా, గణాంకాలు పాత రికార్డులతో సిద్ధమై రావడంతో బీఆర్ఎస్ శిబిరంలో గందరగోళం నెలకొంది. పైగా, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ సభకు హాజరు కాకపోవడాన్ని రేవంత్ తీవ్రంగా తప్పుబట్టారు. రూ. 1.06 కోట్ల జీతభత్యాలు తీసుకుంటూ సభకు రాకపోవడంపై ఆయన చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారాయి.రాజకీయంగా రేవంత్ రెడ్డి ఒక అడుగు ముందుకు వేసి, మరోసారి గెలిచి చూపిస్తాం అని విసిరిన సవాల్ కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. అసెంబ్లీలో చర్చా సమయం ఎక్కువ తీసుకున్నప్పటికీ, ప్రజలకు కనెక్ట్ అయ్యేలా మాట్లాడటంలో రేవంత్ రెడ్డి సక్సెస్ అయ్యారు. కానీ, బీఆర్ఎస్ తరపున మాట్లాడిన నాయకులు కేవలం పాత చింతకాయ పచ్చడి లాంటి విమర్శలకే పరిమితం కావడంతో, అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డిని కట్టడి చేసే అవకాశం చేజారిపోయింది.

## కృష్ణా జిల్లాలో దొంగల బీభత్సం?

### తాడిగడపలో భారీ చోరీ

విజయవాడ , మార్చి 22,
కృష్ణా జిల్లా తాడిగడపలోని మేడసాని వారి వీధిలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మేడసాని తాతేశ్వరరావు ఇంటిని లక్ష్యంగా చేసుకుని దుండగులు భారీగా నగదు, బంగారం దోచుకెళ్లారు. ఫంక్షన్ నిమిత్తం కుటుంబంతో కలిసి బెంగళూరుకు వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దుండగులు ఇంటి వెనుక కిటికీని కట్ చేసి లోపలికి ప్రవేశించి, అల్మారాలు పగులగొట్టి విలువైన ఆభరణాలు, నగదు అపహరించారు. ఉదయం పనిమనిషి ఇంటికి వచ్చేసరికి వెనుక కిటికీ కట్ చేసి ఉండటం గమనించి వెంటనే యజమానులకు సమాచారం అందించింది. అనంతరం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. అదే వీధిలోని మేడసాని రమేష్ బాబు ఇంటిలో కూడా దొంగతనానికి ప్రయత్నించిన దుండగులు, ఇంట్లో వారు మేల్కొనడంతో గోడ దూకి పరారయ్యారు. పారిపోయే క్రమంలో సమీపంలోని తమలపాకు తోటలో గిల్టు నగలను పడవేసి వెళ్లినట్లు గుర్తించారు. ఘటన స్థలానికి క్లూస్ టీం చేరుకుని ఆధారాలను సేకరిస్తోంది. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.
==================

# సూపర్ గేమ్ ఛేంజర్‌గా రీజనల్ రింగ్ రోడ్



హైదరాబాద్, మార్చి 22,
హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం పనులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. 161.5 కిలోమీటర్ల మేర ఆరు వరుసల రహదారిపై ఏఐ కెమెరాలు, అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇవి నిబంధనల ఉల్లంఘనలను గుర్తించడమే కాకుండా, ప్రమాదాల సమయంలో తక్షణ వైద్య సహాయం అందేలా పోలీసు, రవాణా శాఖలను అప్రమత్తం చేస్తుంది. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. సగం తెలంగాణ జిల్లాలను కవర్ చేస్తూ సూపర్ గేమ్ ఛేంజర్‌గా ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఉత్తర, దక్షిణ రెండు భాగాలుగా ఈ రహదారిని నిర్మిస్తుండగా.. ఇప్పటికే ఉత్తర భాగం పనులకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. కేంద్రం జాతీయ నంబర్‌ను కూడా కేటాయించి పనుల కోసం టెండర్లు ఆహ్వానించింది. ఇక ఉత్తర భాగం పనులపై కీలక అప్డేట్ వచ్చింది. ఏఐ టెక్నాలజీతో ఈ భాగం పనులు చేపట్టాలని సర్కార్ భావిస్తోంది. ఇప్పటికే ఖమ్మం-దేవరపల్లి మధ్య నిర్మించిన యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఏఐ ఆధారిత అధునాతన సాంకేతికతను ఉపయోగించారు. ఈ క్రమంలో తెలంగాణలో ప్రారంభించనున్న కొత్త ఎన్‌హెచ్‌ఏఐ రహదారులకు ఇదే తరహా టెక్నాలజీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రెడీ అవుతోంది. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తరభాగం పనుల్లో ఈ టెక్నాలజీ వినియోగించడంపై కేంద్రం ఫోకస్ సారించింది. సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తంగడ్‌పల్లి వరకు 161.5 కిలోమీటర్ల ఆరు వరుసలతో ఈ రహదారి నిర్మిస్తున్నారు. ఈ రహదారి వెంట ఏఐ ఆధారిత సాంకేతికతను వినియోగించడానికి ఎన్‌హెచ్‌ఏఐ తాజాగా ఏర్పాట్లు చేస్తోంది. దాంతో పాటుగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని 4నుంచి 6 వరుసలుగా మార్చడానికి ఇప్పటికే డీపీఆర్ సమర్పించారు. ఇందులో మొత్తం 232 కిలోమీటర్ల పొడవున సాంకేతికతను ఉపయోగించాలని డిసైడ్ అయ్యారు. ఇందులో భాగంగా అడ్వాన్స్డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా తెలంగాణ, ఏపీలోని పోలీసు, రవాణా శాఖలతో రోడ్డు భద్రతను అనుసంధానం చేస్తారు. హైదరాబాద్-నాగ్‌పూర్ మార్గంలోనూ కొత్త టెక్నాలజీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. తెలంగాణ పరిధిలో ఈ రహదారి మొత్తం 251 కిలోమీటర్ల మేర ఉండగా పూర్తిస్థాయిలో కొత్త సాంకేతిక పరిజ్ఞానం తీసుకురానున్నారు.

ఈ ఏఐ టెక్నాలజీలో భాగంగా రహదారి వెంట అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేస్తారు. ట్రాఫిక్ రూల్స్‌కు విరుద్ధంగా మితిమీరిన వేగంతో వాహనాలు వెళ్తే ఈ కెమెరాలు పట్టేస్తాయి. వెంటనే ఆ వాహనదారుడి అడ్రస్‌కు ఆటోమెటిక్‌గా చలాన్లు వెళ్తాయి. దాంతో పాటు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సత్వరమే అలర్ట్ కావటానికి వైద్య సహాయం అందించటానికి వీలు కలుగుతుంది.

# విజయ్ పార్టీకి వరుస కష్టాలు...

### ఖర్చుల భారంతో అభ్యర్థుల ఆందోళన

### పోటీకి దూరమవుతున్న నేతలు



చెన్నై, మార్చి 22,
తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ, నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం పార్టీలో అంతర్గత సంక్షోభం నెలకొన్నట్లు తెలుస్తోంది. భారీ ఆశలతో రాజకీయాల్లోకి వచ్చిన విజయ్‌కు పొత్తులు కుదరకపోవడం, ఎన్నికల ఖర్చుల భారం అభ్యర్థులపైనే పడటంతో టికెట్లు ఆశించిన నేతలు ఇప్పుడు పోటీకి వెనకాడుతున్నట్లు సమాచారం. పార్టీ పెట్టిన మొదట్లో విక్రవాండిలో జరిగిన భారీ బహిరంగ సభలో విజయ్ ఇతర పార్టీలకు పొత్తుల కోసం పిలుపునిచ్చారు. తొలుత ప్రధాన ప్రతిపక్షం అన్నాడిఎంకె తో చర్చలు జరిగినట్లు వార్తలు వచ్చాయి. అయితే, విజయ్ ఏకంగా 100 సీట్లు కావాలని, రెండున్నర ఏళ్లు ముఖ్యమంత్రి పదవిని పంచుకోవాలని డిమాండ్ చేయడంతో అన్నాడిఎంకె వెనక్కి తగ్గి బీజేపీ వైపు మొగ్గు చూపింది. అటు విదుతలై చిరుతైగళ్ కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వంటి పార్టీలు కూడా డిఎంకె కూటమిని వీడకపోవడంతో విజయ్ చివరకు ఒంటరిగానే బరిలోకి దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది. తొలుత పార్టీ టికెట్ల కోసం 10 వేల మందికి పైగా ఉత్సాహంగా అప్లికేషన్లు తీసుకున్నప్పటికీ, దరఖాస్తులను తిరిగి సమర్పించిన వారి సంఖ్య చాలా తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం పార్టీ అధిష్టానం విధించిన కఠిన నిబంధనలేనని సమాచారం. సీటు ఖరారు కావాలంటే పార్టీకి రూ. 1 కోటి చెల్లించాలని అధిష్టానం ఆదేశించినట్లు చెబుతున్నారు. ప్రచారానికి అదనంగా మరో రూ. 2 కోట్లు అభ్యర్థులే సమకూర్చుకోవాలని స్పష్టం చేయడంతో ఆశావహులు షాక్‌కు గురవుతున్నారు. మొదటి విడత ఇంటర్వ్యూలలో సుమారు 300 మంది ఉత్సాహం చూపినప్పటికీ, క్షేత్రస్థాయి పరిస్థితులను చూసి చాలామంది వెనకడుగు వేస్తున్నారు. పొత్తులు ఉంటే ఎంతో కొంత నిధులు సమకూరేవి, కానీ ఒంటరిగా అంత భారీ మొత్తం వెచ్చించి ఓడిపోతే పరిస్థితి ఏంటి? అని పార్టీ నేతలు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. దీంతో అభ్యర్థులను వెతుక్కోవాల్సిన పరిస్థితి విజయ్‌కు ఏర్పడిందిఎన్నికలకు కేవలం నెల రోజులు మాత్రమే సమయం ఉన్న తరుణంలో, నేతలను ఎలా ఒప్పించాలి? అభ్యర్థుల ఎంపికను ఎలా పూర్తి చేయాలి? అనే అంశంపై విజయ్ మల్లగుల్లాలు పడుతున్నారు.

# రద్దు యోచనలేదు

## క్లారిటీ ఇచ్చిన విద్యాకమిషన్



హైదరాబాద్, మార్చి 22
తెలంగాణ విద్యావ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకోబోతున్నాయనే వార్తలు గత కొద్ది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యంగా 2026-27 విద్యా సంవత్సరం నుండి పదో తరగతి బోర్డు పరీక్షలు రద్దు కానున్నాయన్న ప్రచారంపై విద్యాశాఖ కమిషన్ తాజాగా కీలక వివరణ ఇచ్చింది. పదో తరగతి పరీక్షల రద్దుపై వస్తున్న వార్తలను తెలంగాణ విద్యాశాఖ కమిషన్ ఓఎస్డీ డాక్టర్ జీనత్ ఖండించారు. తాము ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పదో తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేయాలని ఎక్కడా సిఫార్సు చేయలేదని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం విడివిడిగా ఉన్న ఎస్ఎస్‌సీ బోర్డును, ఇంటర్మీడియట్ బోర్డును విలీనం చేయాలని ప్రతిపాదించారు. కేవలం 11వ తరగతి పబ్లిక్ పరీక్షలను మాత్రమే రద్దు చేయాలని సూచించినట్లు ఆమె తెలిపారు. తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయవద్దని, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందకుండా కచ్చితమైన సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ఆమె విజ్ఞప్తి చేశారుమరోవైపు సీఎం రేవంత్ రెడ్డి విద్యావ్యవస్థలో సమూల మార్పుల అవసరాన్ని నొక్కి చెప్పారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా +2 విధానాన్ని రాష్ట్రంలోనూ బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో విద్యా సంస్కరణలపై ఏర్పాటు చేసిన కమిటీ అధ్యయనం కొనసాగుతోందని, కమిషన్ ఇచ్చేది తుది నివేదిక కాదని ఆయన స్పష్టం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తెలంగాణ విద్యా రంగాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని సీఎం తెలిపారు. మార్చి 20న అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సంక్షేమ, అభివృద్ధి బడ్జెట్‌గా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఇదే క్రమంలో విపక్షాలపై ఆయన ఘాటైన విమర్శలు చేశారు. బడ్జెట్‌ను నిరసిస్తూ చెవిలో పూలు పెట్టుకుని అసెంబ్లీ నుండి బయటకు వచ్చిన బీఆర్ఎస్ నేతల తీరును ఆయన ఎద్దేవా చేశారు. మాజీ సీఎం కేసీఆర్ వ్యవహారశైలిపై, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై సీఎం తనదైన శైలిలో సెటైర్లు వేశారు. ప్రస్తుతానికి పదో తరగతి బోర్డు పరీక్షల రద్దుపై అధికారికంగా ఎటువంటి జీవో వెలువడలేదు. విద్యాశాఖ కమిషన్ సిఫార్సులను ప్రభుత్వం పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోనుంది. విద్యార్థులు తమ విద్యా ప్రణాళికను యథావిధిగా కొనసాగించాల్సి ఉంటుంది.

# అన్నాఅలా... తమ్ముడు ఇలా...



నల్గొండ, మార్చి 22
కోమటిరెడ్డి బ్రదర్స్. తెలంగాణ పాలిటిక్స్‌లో ఇదో ట్యాగ్ లైన్. అందుకు తగ్గట్లు వారు కూడా ఓ బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారు. కానీ ఆ అన్నదమ్ముళ్ల తీరే సమ్‌థింగ్ డిఫరెంట్. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు. వెంకట్‌రెడ్డి ఆల్రెడీ మంత్రిగా ఉన్నారు. ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ శాఖలు నిర్వహిస్తున్నారు. రాజగోపాల్‌రెడ్డి అమాత్య యోగం దక్కట్లేదన్న అసంతృప్తితో రగిలిపోతున్నారు. సీఎం రేవంత్ టార్గెట్‌గా బాణాలు ఎక్కుపెడుతున్నారు. ఈ క్రమంలో ఆ బ్రదర్స్ రూటు సెపరేటు అయిపోయింది. వెంకట్‌రెడ్డి సీఎం రేవంత్‌కు పాజిటివ్ వాయిస్ వినిపిస్తూనే అప్పుడప్పుడు ట్విస్టులు ఇస్తున్నారు. ఇక రాజగోపాల్‌రెడ్డి మాత్రం మంత్రి పదవి దక్కే వరకు తగ్గేదేలే అన్నట్లుగా అసంతృప్తి సెగ రాజేస్తున్నారు. దీంతో ఈ ఇద్దరు బ్రదర్స్ తీరు కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. సీఎం రేవంత్‌కు కంట్లో నలుసులా..కొరకరాని కొయ్యలా తయారైందట. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగా ఉండి..సినిమా అవార్డుల ప్రదానోత్సవానికి డుమ్మా కొట్టడం హాట్ టాపిక్‌గా మారింది. గద్దర్ అవార్డ్స్ ఫంక్షన్‌లో కోమటిరెడ్డి కనిపించకపోవడం చర్చనీయాంశం అవుతోంది. కోమటిరెడ్డి తన శాఖను గాలికి వదిలేసి..లేనిపోని ఇష్యూల జోలికి వెళ్తున్నారన్న గాసిప్స్ చక్కర్లు కొడుతున్నాయి. అసలు తన శాఖలో జరిగే వ్యవహారాలు తనకు తెలియదన్నట్లుగా అప్పుడప్పుడు స్టేట్‌మెంట్లు ఇస్తూ చర్చకు దారి తీస్తున్నారాయన. సినిమా టికెట్ల రేట్ల పెంపుతో తనకు సంబంధం లేదని ఓసారి..ఇక నుంచి ఏ సినిమాకు టికెట్ల రేట్ల పెంపు ఉండదని మరోసారి పొంతన లేని వ్యాఖ్యలు చేసిన ఆయన ఇప్పుడు ఇంకో ట్విస్ట్ ఇచ్చారు. సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగా ఉండి..ఏకంగా గద్దర్ అవార్డుల ప్రదానోత్సవానికి హాజరు కాలేదు. అయితే బిజీగా ఉండటం వల్లే రాలేదా? లేక వెంకట్‌రెడ్డి అసంతృప్తిగా ఉన్నారా? అనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఇంతకంటే రెండ్రోజుల ముందే జగ్గారెడ్డిని పీసీసీ చీఫ్‌గా చేయాలని ఓ గత్తర లేపారు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. జగ్గారెడ్డి మరో పీజేఆర్ అని..ఆయన లాంటి మాస్ లీడర్‌ను టీపీసీసీ చీఫ్‌గా నియమిస్తే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 100 సీట్లు వస్తాయంటూ చర్చకు తెరలేపారు. దీంతో వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్‌లోని బీసీ నేతల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోందట. ఇక ఇప్పటికే మంత్రి పదవి విషయంలో అన్నదమ్ముళ్ల మధ్య కోల్డ్ వార్ నడుస్తుందని అంటుంటారు. వెంకట్‌రెడ్డిని తప్పిస్తే తప్ప రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చే అవకాశం లేదన్న అభిప్రాయంలో అధిష్టానం ఉందంటున్నారు. అయితే వెంకట్‌రెడ్డే మంత్రిగా కొనసాగాలని కోరుకుంటున్నారట రేవంత్. రాజగోపాల్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకునేందుకు ఆసక్తి చూపట్లేదట. ఇదే రాజగోపాల్‌రెడ్డి ఫ్రస్ట్రేషన్‌కు కారణమంటున్నారు. ఈ క్రమంలోనే అన్నదో దారి అయితే..తమ్ముడిది మరో దారి అన్నట్లుగా మారిపోయిందని అంటున్నారు. ట్రిపుల్ ఆర్ రోడ్డు విషయంలో నిర్వాసితుల పక్షాన రాజగోపాల్‌రెడ్డి వాయిస్ వినిపిస్తే..రీజనల్ రింగ్ రోడ్డు పూర్తి చేయడం తన టార్గెట్ అంటూ చెప్పుకుంటూ వస్తున్నారు వెంకట్‌రెడ్డి. ట్రిపుల్ ఆర్ కోసం భూసేకరణ త్వరగా పూర్తి చేయాలంటూ అధికారులను ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నారాయన. ఇక నల్గొండ డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్ నేత నియామకంపై వెంకట్‌రెడ్డి సుర్రుబుర్రులాడితే .రాజగోపాల్‌రెడ్డి కైలాష్ నేతకు పగ్గాలు అప్పజెప్పడాన్ని స్వాగతించారు. ఇక సీఎం రేవంతే ఇంకో పదేళ్లు సీఎంగా ఉండాలని ఆకాంక్షిస్తూ..దేవుడ్ని కోరుకున్నాని వెంకట్‌రెడ్డి చెప్తే..తానే సీఎం అని రేవంత్ ఎలా చెప్పుకుంటారంటూ అటాక్ చేశారు రాజగోపాల్‌రెడ్డి. తనకు మంత్రి పదవి ఇవ్వట్లేదన్న అసంతృప్తితో పలువురు ఎమ్మెల్యేలతో రాజగోపాల్‌రెడ్డి డిన్నర్ మీటింగ్ నిర్వహించారన్న టాక్ కూడా అధికార పార్టీని కలవరపెడుతోంది. ఇలా ఇష్యూ ఏదైనా..టాపిక్ మరేదైనా.. చెరో తీరు స్పందిస్తూ అన్నదమ్ముళ్లు సీఎం రేవంత్‌కు కొరకరాని కొయ్యలా మారారాన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కరువమంటే కప్పుకు కోపం.. విడవమంటే పాముకు కోపం అన్నట్లుగా ..కోమటిరెడ్డి బ్రదర్స్ ఎవరి మాట వినే పరిస్థితి లేదట. పైగా తీరు మార్చుకోమని చెప్పే సాహసం కూడా ఎవరూ చేయట్లేదట. దీంతో వాళ్లిద్దరి తీరుతో సీఎం రేవంత్ విసిగిపోయారని ఇన్ సైడ్ టాక్. వెంకట్‌రెడ్డి వ్యవహార శైలి మారేదెప్పుడో? రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తి చల్లారేదెప్పుడో చూడాలి.

233.qxd 3/22/2026 11:08 PM Page 6



# విత్తన గుళికలతో నవధాన్యాల సాగు -- భూమి సారవంతతకు నూతన దారి

కడప, భారత శక్తి ప్రతినిధి, మార్చి22: ప్రొద్దుటూరు మండలం, కామనూరు యూనిట్ పరిధిలోని నక్కలదిన్నె గ్రామంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మోడల్ మేకర్ మాధవి గారు పాల్గొని రైతులకు ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ (ప్రావీణ్య) విధానం, విత్తన గుళికల తయారీ మరియు ఘన జీవామృతం వినియోగంపై ప్రాయోగికంగా వివరించారు.

ఈ సందర్భంగా రైతులు శ్రీ బి. వెంకటరామిరెడ్డి గారు, శ్రీమతి బి. ప్రభావతి గారు, శ్రీ వి. వెంకటసుబ్బారెడ్డి గారు తమ పొలాల్లో ప్రతి ఒక్కరు 1.00 ఎకరం చొప్పున మొత్తం 3 ఎకరాల్లో ప్రావీణ్య విధానాన్ని అమలు చేశారు. మొత్తం 45 కిలోల వివిధ రకాల విత్తనాలను విత్తన గుళికలుగా తయారు చేసి, 360 కిలోల ఘన జీవామృతంతో కలిపి పొలాల్లో చల్లడం జరిగింది.

ఈ ప్రావీణ్య విధానాన్ని "నవధాన్యాల సాగు"గా కూడా పిలుస్తారు. ఈ పద్ధతి ద్వారా భూమి 365 రోజుల పాటు పచ్చదనంతో కప్పబడి ఉండి, నేలలో సూక్ష్మజీవుల క్రియాశీలత గణనీయంగా పెరుగుతుంది. దీని వలన నేల సారవంతత మెరుగుపడటంతో పాటు పంటల దిగుబడులు మరియు స్థిరత్వం పెరుగుతాయి.

అలాగే, వర్షాకాలానికి ముందుగానే విత్తనాలను గుళికల రూపంలో నేలలో చల్లడం వలన నేలలో ఉన్న సహజ తేమను సమర్థవంతంగా వినియోగించుకొని విత్తనాలు వేగంగా మొలకెత్తుతాయి. తక్కువ వర్షపాతం ఉన్న పరిస్థితుల్లో కూడా విత్తన గుళికలు మంచి మొలకలు ఇస్తాయని తెలిపారు.



## సేవాలాల్ మహారాజ్ దీక్షలు ప్రారంభం
# భక్తుల రద్దీ పెరుగుతోంది



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మార్చి 22(భారత శక్తి):ముదోల్ తాలూకాలో సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో ప్రతి ఏడాది నిర్వహించే దీక్షలు ఈసారి ఘనంగా ప్రారంభమయ్యాయి. నాజం సింగ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాంతీయ స్వాములు, గురువులు పాల్గొని భక్తులకు ఆధ్యాత్మిక సందేశాలు అందిస్తున్నారు.

ఈ దీక్షల్లో పాల్గొనే భక్తులు ఉపవాసం, భజనలు, పూజలు నిర్వహిస్తూ సేవాలాల్ మహారాజ్ బోధనలు ఆచరిస్తున్నారు. ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించడంతో పాటు గ్రామాలలో శోభాయాత్రలు కూడా జరుగుతున్నాయి.

ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ, సేవాలాల్ మహారాజ్ చూపిన ధర్మ మార్గాన్ని అనుసరించాలని, సమాజంలో ఐక్యత, సేవ భావం పెంపొందించాలని పిలుపునిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరవడంతో ఆలయ ప్రాంతం భక్తిరసంతో నిండిపోయింది.

స్థానిక అధికారులు భక్తుల రాకపోకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భద్రత, తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచారు.

ఈ దీక్షలు మరికొన్ని రోజులు కొనసాగనున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవిస్తున్నారు.



# మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు: జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

నిర్మల్ జిల్లా ప్రతినిధి మార్చి 22(భారత శక్తి)జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు, జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత వాహన తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరం మాత్రమే కాకుండా చట్టపరంగా కూడా శిక్షార్హమని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు, లైసెన్స్ రద్దు వంటి చర్యలు ఉంటాయని వాహన దారులను హెచ్చరించారు అలాగే హెల్మెట్ లేకుండా బైక్ నడపడం, సీట్ బెల్ట్ ధరించకుండా కార్ డ్రైవ్ చేయడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం,అతివేగం, ట్రిపుల్ రైడింగ్ వంటి నిబంధనల ఉల్లంఘనలపై చట్ట పరమైన కేసులు నమోదు చేయబడుతామని పోలీసులు హెచ్చరించారు. ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని, తమ కుటుంబాల భద్రత కోసం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, తెలిపారు.

# ఘనంగా రంజాన్ పండుగ వేడుకలు: మాజీ కౌన్సిలర్ సయ్యద్ ఇర్ఫాన్.

నిర్మల్ జిల్లా, ప్రతినిధి మార్చి 22 (భారత శక్తి): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని భైంసాలో మాజీ కౌన్సిలర్ సయ్యద్ ఇర్ఫాన్ నివాసంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిరు విందుకు భైంసా మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి, వైస్ చైర్మన్ మీర్జా ఇద్రిస్ బెగ్, మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, విఠల్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రంజాన్ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక ఐక్యత, సౌహార్దతను కాపాడుతూ అందరూ కలిసి పండుగలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం అతిథులు అందరూ కలిసి ఏర్పాటు చేసిన విందును ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆళ్లపాడు
# నియోజకవర్గస్థాయి కబడ్డీ క్రికెట్ పోటీలు ప్రారంభం

ఖమ్మం బ్యూరో, భారత శక్తి, మార్చి 22: అమ్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోనకల్ మండల పరిధిలోని ఆళ్లపాడు గ్రామంలో నిర్వహిస్తున్న మధిర, వైరా నియోజకవర్గ పరిధిలోని మరియు గంపలగూడెం, వత్సవాయి మండలాల కబడ్డీ క్రికెట్ పోటీలను ఆదివారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుంగ రాములు మండల కమిటీ సభ్యుడు పారా వెంకట మోహన్ రావు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు తోటకూర వెంకటేశ్వరరావు, చిన్న కేసి పెద్ద వెంకయ్య, బరకయ్య గ్రామ పెద్దలు కలిసి క్రికెట్ లీగ్ మ్యాచ్ లను ప్రారంభించడం జరిగింది. రాపల్లి వర్సెస్ బోనకల్ నిర్వహించగా రాపల్లి టీమ్ గెలుపొందడం జరిగింది.

క్రీడాకారులు గమనించాలని గ్రామ పెద్దలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కందుల పాపారావు, వేల్పుల రమేష్, నర్సింగుల నరేష్, మంద వరప్రసాద్, వేల్పుల అనిల్, మరీదు చిన్న ముత్యాలు, మరీదు వేణు, షేక్ నాగుల్ మీరా, మంద సైదులు, గుడిద రామారావు, గుడిది రాము, కాలసాని అయితం రాజు, మరీదు వేణు, మరీదువెంకన్న, మరీదు రామకృష్ణ, సిరిగిరి ఇస్తారు, మొండితోక జమలయ్య, మొండితోక ఆదాం, వేల్పుల సురేష్, చింతపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# పదేళ్ల నిరీక్షణకు తెర.. కొండాపూర్ గ్రామంలో డ్రైనేజీ పనుల ప్రారంభం
## గ్రామ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న సర్పంచ్ వంకాయల గౌతమి ప్రశాంత్



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 22, (భారత శక్తి): గత పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది.కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామంలో 7వార్డులో నేవురి దేవరాజు ఇంటి నుండి నెలకొన్న మురుగునీటి సమస్యను పరిష్కరించే దిశగా గ్రామ సర్పంచ్ వంకాయల గౌతమి ప్రశాంత్, గ్రామ పాలకవర్గం కీలక అడుగు వేశారు. ఆదివారం కొత్తగా డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను సర్పంచ్ గౌతమి, ఉపసర్పంచ్ రాజిరెడ్డి, వార్డు సభ్యులు శాస్త్రోక్తంగా కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..గత పదేళ్లుగా ఈ ప్రాంత ప్రజలు డ్రైనేజీ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తమ దృష్టికి వచ్చిన వెంటనే నిధులు కేటాయించి పనులు మొదలుపెట్టినట్లు తెలిపారు. ఎన్నేళ్లుగానో పెండింగ్‌లో ఉన్న పనులు ఇప్పుడు కార్యరూపం దాల్చడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.గ్రామ అభివృద్ధిలో రాజీ పడకుండా, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పాలకవర్గం ముందుకు సాగుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పూంద్ర రాజిరెడ్డి, గ్రామ పాలకవర్గ సభ్యులు, వార్డు ప్రతినిధులు, స్థానికులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

233.qxd 3/22/2026 11:08 PM Page 7



# బోనకల్‌లో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం వైపు అడుగులు వేస్తున్న గ్రామ పంచాయతీ పాలకవర్గం

## -గ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్

ఖమ్మం బ్యూరో, భారత శక్తి, మార్చి 22: బోనకల్ మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం ముందడుగు వేసింది. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ట్రాఫిక్ జామ్ సమస్యను తగ్గించేందుకు వినూత్న చర్యలు చేపడుతోంది.

ఇందులో భాగంగా, ఇప్పటివరకు ఖాళీగా ఉన్న ఆర్‌ఓబి (=ాదీ) బ్రిడ్జి కింద ఉన్న ఖాళీ ప్రదేశాలను వినియోగంలోకి తీసుకువచ్చే పనులను ప్రారంభించింది.

మండల కేంద్రంలో గల గ్రామీణ వికాస్ బ్యాంకు దగ్గర ప్రతిరోజు రోడ్డుకి ఇరువైపులా టూ వీలర్ మరియు పెద్ద వాహనాలు పార్కింగ్ చేయడంతో రైల్వే స్టేషన్ కి వెళ్ళే ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.

మండల కేంద్రంలో ఇప్పటికే బ్రిడ్జి కింద ఒక కానా వాహనదారులకు పార్కింగ్ కొరకు కేటాయించారు. అయినా సరే విపరీతమైన వాహనాలు రోడ్డుపై నిలుపు వేయడంతో ప్రయాణికులకు, స్థానికులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. ఇది గమనించి బ్రిడ్జి కింద ఉన్న బ్యాంక్ ఎదురుగా ఒక కానాను మరియు బ్రిడ్జి చివరగా ఉన్న మరొక కానాను వాహనాలు నిలిపేందుకు

ఈ ప్రాంతాలను వాహనాల రాకపోకలకు అనుకూలంగా మార్చి, ప్రత్యామ్నాయ మార్గాలుగా అభివృద్ధి చేయాలని పంచాయతీ యోచిస్తోంది.

ఇప్పటికే కొన్ని కాణాల కింద కొంతమంది స్థానికులు సొంత ప్రయోజనాల కోసం అక్కడ ఉన్న చెట్లను క్రమక్రమంగా తొలగించి గేదెలను కట్టివేయడం మరియు వ్యాపారాలు చేసుకోవడం కోసం ఉపయోగించుకుంటున్నారు. అందరికీ ఉపయోగపడే స్థానిక ప్రాంతాలు కొంతమంది మాత్రమే అనుభవిస్తుండడంతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక పంచాయతీ పాలకవర్గం గమనించింది.

ఈ చర్యతో ప్రధాన రహదారిపై ఉండే ఒత్తిడి తగ్గి, వాహనదారులకు సులభంగా ప్రయాణం చేసే వీలుంటుందని అధికారులు భావిస్తున్నారు. స్థానిక వ్యాపారులు, ప్రజలు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, ట్రాఫిక్ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ పంచాయతీ పాలకవర్గం మాట్లాడుతూ, "ప్రజలకు



సౌకర్యవంతమైన రవాణా అందించడమే మా లక్ష్యం. అందుకోసం అందుబాటులో ఉన్న ప్రతి వనరును ఉపయోగించుకుంటూ సమస్యలకు పరిష్కారం చూపుతాం" అని తెలిపారు.

మొత్తంగా, గ్రామపంచాయతీ తీసుకున్న ఈ చర్య బోనకల్‌లో ట్రాఫిక్ సమస్యను తగ్గించడంలో కీలకంగా మారనుందనీ స్థానిక వ్యాపారులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# బీఎస్ఏ చే సేవారత్న అవార్డుల ఎంపిక దరఖాస్తుల ఆహ్వానం:

## రాష్ట్ర అవార్డుల ఎంపిక సభ్యులు తాటి కంటి ఐలయ్య.

రేగొండ,మార్చి22 ( భారత శక్తి):బహుజన సాహిత్య అకాడమీ వారిచే ఏప్రిల్ లో అందించే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే వంటి ప్రతిష్టాత్మకైనా సేవరత్న అవార్డుల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బిఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సెలక్షన్ కమిటీ సభ్యులు తాటి కంటి ఐలయ్య పేర్కొన్నారు.ఈ అవార్డుల ఎంపిక ప్రతి సంవత్సరంలో ఓసారి సేవ రత్న అవార్డుల అందించే కార్యక్రమాన్ని హైదరాబాదులో ఏప్రిల్ 19న అందజేయడం జరుగుతుందని ఐలయ్య తెలిపారు. సేవాభావం, సాహితి, కవిత్వం రచన, ఆర్థిక చేయూత, ప్రజాసేవ అందించే అర్హులైన వారిని గుర్తించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే, ఏపీజే అబ్దుల్ కలాం, విద్య, క్రీడలు, కల రంగాలు కార్మిక రత్న వంటి ప్రతిష్టాత్మకైనా అవార్డులు అందుకునేందుకు మార్చి నుంచి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని ఐలయ్య అన్నారు.ఏప్రిల్ 19 హైదరాబాదులో తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలతో పాటు ఆంధ్ర ప్రదేశ్ కర్ణాటక తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి సుమారుగా 200 పైన అతిరధుల మేధావుల చేతుల మీదుగా సెలెక్ట్ అయిన వారికి అందించడం బీఎస్ఏ ప్రధాన లక్ష్యమన్నారు. బహుమతులు అందజేత కార్యక్రమానికి రాష్ట్ర బహుజన సాహితి సాహిత్య అకాడమీ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అతిరథ మహారధుల అవార్డులను అందజేయనున్నారని రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐలయ్య పేర్కొన్నారు.దరఖాస్తులు అందించే ఆసక్తిగల నాయకులు యువకులు కార్మికులు తమ బయోడేటాను ఈ నెంబర్ 9951771712 కు సంప్రదించి ఈనెల చివరి వరకు దరఖాస్తులను పంపించాలని తాటికంటి ఐలయ్య తెలిపారు.




# మాజీ ఎంపీటీసీ బిక్షపతి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

రేగొండ,మార్చి22(భారత శక్తి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీ మైస బిక్షపతి తల్లి మైస లక్ష్మి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని కాంగ్రెస్ జిల్లా నాయకులు పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ మైస బిక్షపతి తల్లి మృతి పట్ల ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తో పాటు కాంగ్రెస్ శ్రేణులు పరామర్శించగా, ఆదివారం ఎన్ఎస్ఆర్ సంస్థల యజమాని రాష్ట్ర నాయకులు నాయినేని సంపత్ రావు ఆధ్వర్యంలో ఉమ్మడి మండల మాజీ సొసైటీ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు,జిల్లా కాంగ్రెస్ నాయకులు శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మోడెం ఉమేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి పత్తి ప్రభాకర్,గండి తిరుపతి గౌడ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మైస రమేష్, వార్డు సభ్యులు మైస సురేందర్ లు బిక్షపతి కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబంలో నెల రోజుల క్రితమే రిటైర్డ్ కండక్టర్ మైస వీరస్వామి చనిపోవడం, ఆ తర్వాత తల్లి లక్ష్మి మృతి చెందడం బాధాకరమని జరగవలసిన కార్యక్రమాలను మనో ధైర్యంతో జరిపించాలని కాంగ్రెస్ నేతలు మృతి చెందిన చిత్రపటాల వద్ద పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.



# నందిని సిద్ధారెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న కవి,రచయిత,సీనియర్ పాత్రికేయులు- కందుకూరి యాదగిరి

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి) మార్చి 22 :

ఈనెల 14వ తేదీన హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో,తెలుగు భాషా చైతన్య సమితి జాతీయ తెలుగు సారస్వత పరిషత్తు వారి ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కవి రచయిత సీనియర్ పాత్రికేయులు సూర్యాపేట నివాసి కందుకూరి యాదగిరి పాల్గొని తన ఉగాది కవితను వినిపించారు.కార్యక్రమం అనంతరం ముఖ్యఅతిథి తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు డాక్టర్ నందిని సిద్ధారెడ్డి చేతులమీదుగా సన్మానం ప్రశంసా పత్రం అందుకున్నారు.ఈ కార్యక్రమంలో కుసుమ ధర్మన్న కళాపీఠం చైర్పర్సన్ డాక్టర్ రాధాకుసుమ, ప్రముఖ కవి విమర్శకులు రామకృష్ణ చంద్రమౌళి, తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షులు



పి.బడే సాబ్, గోల్కొండ సాహితీ కళా సమితి అధ్యక్షులు డాక్టర్ అర్ధ చంద్ర ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ నీటి దినోత్సవం

కడప, భారత శక్తి ప్రతినిధి, మార్చ్ 22: డాక్టర్ సి.యామిని అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప మరియు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ సూచనల మేరకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే చెన్నూరు మండలం దౌలతాపురం నందు 22-03-2026 వ తేదీన "ప్రపంచ నీటి దినోత్సవం" సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగినది. పలు అంశాలపై అవగాహన కార్యక్రమం" నిర్వహించడం జరిగినది.



ఈ సందర్భంగా మాట్లాడుతూ డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వినయ్ కుమార్ మార్చి 22 న ప్రపంచ జల దినోత్సవంగా నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి తీర్మానించింది. ప్రపంచ నీటి దినోత్సవాన్ని అంతర్జాతీయంగా పాటించాలన్న ఆలోచన, 'పర్యావరణం, ప్రగతి' అనే అంశంపై బ్రెజిల్‌లోని రియో డి జనీరియో వేదికగా 1992లో జరిగిన ఐక్యరాజ్యసమితి సమావేశంలో రూపుదిద్దుకుంది. ఇందులో భాగంగా ఏటా మార్చి 22న ప్రపంచ నీటి దినోత్సవంగా పాటిస్తున్నారు. ఈ ఏడాది "ఎవరినీ వదిలిపెట్టను" (హ్ముజఊఅస్త్ర అశీ శీఅవ ఎవష్ట్రఱఅ') నినాదాన్ని ఐరాస ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా 2030 నాటికి ప్రతీ ఒక్కరికీ పరిశుభ్రమైన నీటిని అందజేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇక, అంతరిక్షం నుంచి చూస్తే భూమి నీలి రంగులో కనిపించడానికి కారణం నీరు. భూమిపై 75 శాతం వరకూ నీటి వనరులు ఉన్నాయి.

భూగోళం మీద నీటి వనరులలో 99 శాతం ఉప్పు నీరే. ఇందులో 97 శాతం సముద్రాల్లో ఉండగా, మిగితాది నదులు, చెరువుల్లో ఉంది. తాగడానికి ఉపయోగపడే జలాలు కేవలం 1 శాతం మాత్రమే ఉన్నాయి. అందులో 0.86 శాతం చెరువులు, 0.02 శాతం నదుల్లో, మిగితా 0.12 శాతం భూగర్భ జలాలు. అంటే ప్రపంచ వ్యాప్తంగా కేవలం 0.3 శాతం ఉపయోగపడే నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ వనరులే ప్రపంచవ్యాప్తంగా ఉన్న 700 కోట్ల మంది దాహాన్ని, ఇతర అవసరాలను తీరుస్తున్నాయి. భారత్‌లో సింధు నాగరికత, ఈజిప్టులో నైలు నది నాగరికత ఇలా ప్రపంచ నాగరికతలు నదీ తీరాలు, నీటి వనరులకు సమీప ప్రాంతంలో విలసిల్లాయి. మన చరిత్రంతా జలవనరులతోనే ముడిపడి ఉంది.

జీవం నీటితో మొదలైంది. ప్రకృతి నీటితోనే నడుస్తోంది. అభివృద్ధి జరగాలంటే నీటి వనరులు కావాలి. జీవవైవిధ్య రక్షణ, జీవం నీటితోనే సాధ్యమవుతుంది. ఇవన్నీ తెలిసినా ఈరోజు జరుగుతున్నదేంటి? నీటిని వృధా చేస్తూ కలుషితం చేసి విషతుల్యంగా మార్చేస్తున్నాం. ప్రపంచంలో కోట్లాది మంది తాగడానికి నీరు లేక దాహంతో అల్లాడిపోతుంటే, ఉన్న నీటిని వృధాగా నేల పాలు చేస్తున్నాం. నీటి వనరులను వ్యర్థాలతో కలుషితం చేసి తాగడానికి వీల్లేని విధంగా తయారుచేస్తున్నాం.

2050 నాటికి ఈ భూమ్మీద తాగడానికి పుష్కలమైన జలం ఉండనే ఉండదని, జనం స్నానాలు చేయడం మానేసి శరీరానికి రసాయనిక లేపనాలు పులుముకుంటారని, కెమికల్ బాత్ చేస్తారని, సరిహద్దుల్లో ఉండాల్సిన సైన్యం నీటి వనరుల చుట్టు కాపలా ఉంటుందని, తలంటు కోవడానికి నీరు సరిపోక ప్రజలందరూ బోడి గుండుతో జీవిస్తారనీ, స్త్రీ పురుషులందరూ రోజు తల షేవ్ చేసుకునే పరిస్థితి వస్తుందని దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వ్యాఖ్యానించారంటే పరిస్థితిని ఎలా ఉంటుందో అంచనా వేయొచ్చు.

నీటిని వృధా చేయడం సృష్టికి, భగవత్తత్వానికి, సమస్త ప్రాణకోటికి వ్యతిరేకం. నీటిని కాపాడాలి, ప్రతి నీటి బొట్టు విలువైందే. భూగోళంలో కేవలం 0.3 శాతం మాత్రమే శుద్ధనీటి వనరులు ఉన్నాయి. ఇప్పటికే చాలా భాగం కలుషితమయ్యాయి. పూర్తిగా కలుషితమైతే పరిస్థితేంటి? రాబోయే తరాలకు మనం ఇచ్చేదేంటి?

సామాజిక ఆర్థిక వృద్ధి ఎక్కువగా నీటిపైనే ఆధారపడి ఉంటుంది. త్రాగునీరు మానవ ఆరోగ్యానికి, శ్రేయస్సుకు చాలా అవసరం, పోషకాహారం, గాలి, మానవ జాతికి ప్రాథమిక జీవనోపాధిని అందిస్తుంది, ఇవి లేకుండా మనిషి జీవించడం అసాధ్యం. మంచినీటి విషయానికి వస్తే, గ్రహం మొత్తం వైశాల్యంలో కొద్ది భాగం మాత్రమే మానవ ఉపయోగానికి అనుకూలంగా ఉంటుంది. జీవం నీటితో మొదలైంది. ప్రకృతి నీటితోనే నడుస్తోంది. అభివృద్ధి జరగాలంటే నీటి వనరులు కావాలి. జీవవైవిధ్య రక్షణ, జీవం నీటితోనే సాధ్యమవుతుంది.

# అనుదీప్ హత్య పై విచారణ జరపాలి హంతకులను అరెస్ట్ చేయాలి : కాపు జే ఏ సి అధ్యక్షులు చందు జనార్దన్

విజయవాడ,మార్చ్ 22(భారత శక్తి):

అంబటి అనుదీప్ హత్య పై పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేసిన రాష్ట్ర కాపు జే ఏ సీ అధ్యక్షులు చందు జనార్ధన్. విజయవాడ లో ఆయన కాపు జే ఏ సి కార్యాలయం లో మాట్లాడుతు నూజివీడు నియోజక వర్గం లో చా ట్రాయ్ లో కాపు కుటుంబ సభ్యుడైన అంబటి అనుదీప్ మరణం హత్యేనని మండలం అంతా ఘోషిస్తువుంటే స్థానిక స్టేషన్ అధికారులు చోద్యం చూస్తున్నారని చందు జనార్ధన్ ఆరోపించారు.ఈరోజు చట్రాయ్ లో అనుదీప్ యొక్క దశదినకర్మ ను కుటుంబం నిర్వహించిందని అంబటి అనుదీప్ కి సంతాపం తెలుపుతూ వారి కుటుంబానికి కాపు జే ఏ సి పక్షాన సానుభూతిని తెలియ చేశారు.

అనుదీప్ ది హత్యేనని చా ట్రాయ్ పోలీస్టేషన్ లో తండ్రి అంబటి గోపాలరావు ఫిర్యాదు చేశారు.కానీ స్టేషన్ అధికారులు చర్యలు తీసుకోలేదు

అనుదీప్ హత్యపై మండల నాయకత్వం,మరియు జనసేన నాయకులు జగన్ రాష్ట్ర కాపు జే ఏ సి నాయకత్వం సంఘటన పై వివరించగా బుధవారం వెంటనే 3 గంటలకు అనుదీప్ నివాసానికి వెళ్లడం జరిగింది.కాపు కుటుంబ సభ్యులు మండల నాయకత్వం 300 మంది రావడం వారందరి ఆవేదన వినడం సమావేశం జరపడం జరిగింది

అనుదీప్ తండ్రి మాట్లాడుతూ తన కుమారుడిని



హతమార్చారని,పోలీస్ యంత్రాంగం పూర్తిగా నేరస్తులకు వంత పాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అదే బాటలో అక్కడ ఉన్న అందరూ స్పష్టం చేయడం జరిగింది.

అనుదీప్ హత్య పై సమగ్ర దర్యాప్తు చేయాలి దోషులను కఠినంగా శిక్షించాలి

నేరస్తులకు వంత పాడిన స్టేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలి కుట్రలో భాగస్తులను అరెస్ట్ చేయాలని రాష్ట్ర కాపు జే ఏ సి అధ్యక్షులు చందు జనార్ధన్ నేడు డిమాండ్ చేశారు.

జిల్లా ఉన్నతాధికారులు ఈ అంశాలపై వెంటనే చర్యలు తీసుకొపోతే రాష్ట్ర కాపు జే ఏ సి చా ట్రాయ్ లో నిరవధిక నిరసన కార్యక్రమం చేపడుతుందని ప్రకటించారు.

# మోదీకి నేను 'అంధభక్తురాలిని'.. 'ధురంధర్ 2' సినిమాపై రేణు దేశాయ్ కామెంట్స్ వైరల్!

* ప్రధాని మోదీకి, బీజేపీకి తాను గర్వపడే అంధభక్తురాలినని ప్రకటించిన రేణు దేశాయ్
* 'ధురంధర్ 2' సినిమాను ప్రశంసిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు
* 'చాయ్‌వాలా' అధికారంలోకి వచ్చాక శత్రువుల్లో భయం పెరిగిందన్న డైలాగ్‌ను షేర్ చేసిన వైనం
* సైన్యాన్ని గౌరవించే ప్రతి ఒక్కరూ ఈ సినిమా చూడాలని సూచన
* సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన రేణు దేశాయ్ వ్యాఖ్యలు



నటి రేణు దేశాయ్ సోషల్ మీడియా వేదికగా చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రధాని నరేంద్ర మోదీని, బీజేపీని ప్రశంసిస్తూ తాను "గర్వపడే అంధభక్తురాలిని" అని ఆమె బహిరంగంగా ప్రకటించారు. తాజాగా 'ధురంధర్ 2' సినిమాను సమీక్షిస్తూ ఆమె పెట్టిన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలు ఇప్పుడు వైరల్ అయ్యాయి. ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్: ది రివెంజ్' చిత్రాన్ని వీక్షించిన అనంతరం రేణు దేశాయ్ తన అభిప్రాయాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. ఈ క్రమంలో ఆ సినిమాలోని ఓ సన్నివేశాన్ని ఆమె ప్రత్యేకంగా హైలైట్ చేశారు. ఆ వీడియో క్లిప్‌లో అస్వస్థతతో ఉన్న దావూద్ ఇబ్రహీంను పోలిన ఓ విలన్ పాత్ర, "ఎప్పటి నుంచైతే ఈ చాయ్‌వాలా హిందుస్థాన్‌లో అధికారంలోకి వచ్చాడో, అప్పటి నుంచి మన వాళ్లలో భయం ఇంకా పెరిగిపోయింది" అని అంటుంది. "చాయ్‌వాలా కా జల్వా" అనే క్యాప్షన్‌తో ఉన్న ఈ వీడియోను రీషేర్ చేసిన రేణూ, "బీజేపీకి, మన అద్భుతమైన ప్రధాని మోదీజీకి నేను గర్వపడే అంధభక్తురాలిని" అని రాసుకొచ్చారు. అంతకుముందు మరో పోస్ట్‌లో మన సైనిక దళాలు, నిఘా ఏజెన్సీల పట్ల గౌరవం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ సినిమాను తప్పకుండా చూడాలని ఆమె సూచించారు. "వారి వల్లే మనం మన ఇళ్లలో ప్రశాంతంగా జీవిస్తున్నాం" అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఏపీలో జనసేన, బీజేపీ, టీడీపీ కూటమి అధికారంలో ఉండగా, పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ రాజకీయ నేపథ్యంలో రేణు దేశాయ్ నేరుగా ప్రధాని మోదీకి, బీజేపీకి ఇంత బలంగా మద్దతు తెలపడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆమె వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది.




# పింక్ లెహంగాలో..



అందం, అభినయంతో రెండు దశాబ్దాలుగా టాలీవుడ్ ప్రేక్షకులను అలరిస్తూనే ఉంది మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా. కేవలం వెండి తెరపైన మాత్రమే కాకుండా ఫ్యాషన్‌ప్రపంచంలోనూ తనదైన ముద్ర వేస్తోంది. తాజాగా లక్మే ఫ్యాషన్ వీక్ వేదికగా ఈ బ్యూటీ ధరించిన పింక్ డిజైనర్ దుస్తులు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ ఫొటోలోని మెరుపులు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ భూమిక శర్మ రూపొందించిన ఆఫ్టర్ గ్లో కలెక్షన్‌లో భాగంగా ఈ పింక్ కలర్ మోడ్రన్ లెహంగాలో తమన్నా మెరిసింది. పింక్ లెహంగాపై చేసిన సునిశితమైన ఎంబ్రాయిడరీ వర్క్.. జతగా ఎంపిక చేసుకున్న మోడ్రన్ బ్లౌజ్ ఆమె అందాన్ని రెట్టింపు చేశాయి. ఆధునికత, సంప్రదాయం కలగలిసిన ఈ లెహంగాలో ఎంతో హుందాగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి. సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం పురుషన్, ఓ రోమియో, రేంజర్ చిత్రాల్లో నటిస్తోంది. వివాన్- ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్ షూటింగ్ దశలో ఉంది. నెట్‌ఫ్లిక్స్, హాట్‌స్టార్ వంటి ప్రముఖ ఓటీటీ సంస్థల కోసం కొన్ని వెబ్ ఒరిజినల్స్‌లో నటించనున్నట్లు సమాచారం.

# నన్ను భయపెట్టారు



సౌత్‌సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మలయాళీ కుట్టి నయనతార.. దాదాపు స్టార్‌హీరోలందరితోనూ ఆడిపాడింది. ఇటీవల ' మన శంకర వర ప్రసాద్‌గారు' మూవీలో మెగాస్టార్‌చిరంజీవితోనూ జతకట్టింది ఈ లేడీ సూపర్ స్టార్. ఇక లేటెస్టుగా యశ్ నటిస్తున్న 'టాక్సిక్' మూవీలో ఆమె గంగ పాత్రలో కనిపించనుంది. మరోవైపు స్టార్ హీరోయిన్‌గా రాణిస్తున్న తరుణంలోనూ స్పెషల్‌సాంగ్స్ తోనూ అలరించింది. కాగా.. ఇటీవల తన గతంలో జరిగిన ఒక ఘటన గురించి నయనతార గుర్తు చేసుకుంటూ ఎమోషనల్ అయ్యింది. 'విజయ్ 'శివకాశీ' చిత్రంలో స్పెషల్‌సాంగులో నాకు నటించే చాన్స్ వచ్చింది. అందుకు నేను కూడా ఒప్పుకున్నాను. అయితే ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నారంటూ చాలా మంది నన్ను ప్రశ్నించారు. ఇకపై అందరూ అలాంటి పాటల్లోనే నటించమని అడుగుతారని భయపెట్టారు. అయితే స్పెషల్ పాట అయితే స్పెషలేగా.. ఏదో ఒక ఇమేజ్ ఉంటేనే నాకు స్పెషల్ సాంగ్‌లో నటించే అవకాశం వచ్చింది. దాని ద్వారా పలు విషయాలు నేర్చుకోవచ్చని భావించా. అలా నేను నటించిన రెండు స్పెషల్ సాంగ్స్‌తో చాలా విషయాలు నేర్చుకున్న' అంటూ నయన్ చెప్పుకొచ్చింది.

# ఫేక్ సింగ్ దుమారం



టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి పూనమ్ కౌర్. కేవలం వెండితెరపై నటనకే పరిమితం కాకుండా, సమాజంలో జరిగే అన్యాయాలపై, ముఖ్యంగా మహిళా సమస్యలపై తన గళాన్ని వినిపిస్తూ నిత్యం వార్తల్లో నిలుస్తుంటుంది. తాజాగా ధురంధర్ 2 సినిమా విడుదల నేపథ్యంలో ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన ఈ సినిమా చూసిన పూనమ్ ఆసక్తికరమైన పోస్ట్ చేసింది. ది రియల్ సింగ్, స్టోరీ ఆఫ్ రియల్ హీరో అంటూ..ఏ ఫేక్ సింగ్ కూడా ఈ బాక్సాఫీస్ ముందు నిలబడలేరని చేసిన వ్యాఖ్యలు పెద్ద చర్చకు దారితీశాయి. వాస్తవానికి ధురంధర్ 2 విడుదలైన సమయంలోనే పవన్ కల్యాణ్ నటించిన ఉస్తాద్ భగత్ సింగ్ కూడా థియేటర్లలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో పూనమ్ చేసిన ఫేక్ సింగ్ వ్యాఖ్యలు నేరుగా పవర్‌స్టార్‌ను ఉద్దేశించినవేనని మెగా అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# గోల్డ్ స్మగ్లింగ్: రూ.2 కోట్లు మోసపోయిన కన్నడ నటి రన్యా రావు!



కన్నడ చిత్ర పరిశ్రమను కుదిపేసిన గోల్డ్ స్మగ్లింగ్ కేసులో నిందితురాలైన నటి రన్యా రావుకు సంబంధించి ఓ విస్తుపోయే నిజం బయటపడింది. అక్రమ మార్గంలో కోట్లు సంపాదించాలని స్మగ్లింగ్ మొదలుపెట్టిన ఆమె, అదే ప్రయత్నంలో ఏజెంట్ చేతిలో మోసపోయి రూ.2 కోట్లు నష్టపోయినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణలో వెల్లడైంది. తక్కువ ధరకు నేరుగా ఆఫ్రికా గనుల నుంచి బంగారం కొనుగోలు చేయాలని రన్యా ప్లాన్ చేసింది. ఇందుకోసం 'బెన్' అనే ఉగాండా ఏజెంట్‌ను నమ్మింది. అయితే, ఆ ఏజెంట్ ఆమె నుంచి రూ.2 కోట్లు తీసుకుని, బంగారం ఇవ్వకుండా మోసం చేశాడు. ఆఫ్రికాలో మోసపోయిన తర్వాత, రన్యా తన పంథా మార్చింది. దుబాయ్ మార్కెట్లో బంగారం కొని భారత్‌కు అక్రమంగా తరలించడం ప్రారంభించింది. తన సవతి తండ్రి సీనియర్ పోలీస్ అధికారి (ఏడీజీపీ) కావడంతో ఎయిర్‌పోర్టులో లభించే 'ప్రొటోకాల్' సౌకర్యాన్ని దుర్వినియోగం చేసింది. దీని ద్వారా కస్టమ్స్ అధికారుల కళ్లుగప్పి సులభంగా తప్పించుకునేది. 2024 మార్చి నుంచి 2025 మార్చి మధ్య కేవలం ఏడాది కాలంలోనే ఆమె 15 సార్లు దుబాయ్ వెళ్లివచ్చినట్లు అధికారులు గుర్తించారు. ఈ పర్యటనల్లో సుమారు 127 కిలోల బంగారాన్ని స్మగ్లింగ్ చేసినట్లు ఈడీ తన ఛార్జ్ షీట్‌లో పేర్కొంది. దీని విలువ సుమారు రూ.102 కోట్లు ఉంటుందని అంచనా. ప్రస్తుతం ఈ కేసులో రన్యా రావు బెంగళూరు సెంట్రల్ జైలులో ఉంది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) ఆమెకు సుమారు రూ.102.55 కోట్ల భారీ జరిమానా విధించింది. ఈ కేసులో ఆమె తండ్రి పాత్రపై కూడా అంతర్గత విచారణ కొనసాగుతోంది.

# ఇరుముడి' కోసం రీమిక్స్ పాట?




రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇరుముడి'. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రియా భవానీ శంకర్ కథానాయిక. సాయికుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాలో రవితేజ అయ్యప్ప స్వామి భక్తుడిగా కనిపించనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే దీనికోసం ఎంతో ప్రాచుర్యం పొందిన అయ్యప్ప గీతం ''ఎక్కినాడు పల్లకి''ని రీమిక్స్ చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ అంశంపై సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ స్పందించారు. ఆ పాటను రీమిక్స్ చేయమని ప్రేక్షకులు, అభిమానుల నుంచి డిమాండ్ వస్తున్న మాట వాస్తవమని.. దర్శక నిర్మాతలు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తెలియజేశారు. మరి త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుందేమో చూడాలి. తండ్రీకూతురు అనుబంధాలతో ముడిపడిన ఎమోషన్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. ఈ ఏడాది ఆఖర్లో తెరపైకి రానుంది. ఈ చిత్రానికి కూర్పు: ప్రవీణ్ పూడి, ఛాయాగ్రహణం: విష్ణు శర్మ.

# కొందరు రాజులు ఎప్పటికీ మరణించరు!

'శంబాల' విజయంతో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించారు దర్శకుడు యుగంధర్ ముని. దీన్ని మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మించిన సంగతి తెలిసిందే. ఇప్పుడిదే కాంబోలో మరో సోషియో ఫాంటసీ సినిమా పట్టాలెక్కనుంది. సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని శనివారం అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు ఓ కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. యుద్ధభూమిలో ఓ సింహం, తోడేలు పోరుకు సిద్ధమవుతున్నట్లు చూపించడం.. ఆ రెండింటి మధ్య ఓ పురాతన ఖడ్గం ప్రకాశిస్తూ కనిపించడం ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ''కొన్ని యుద్ధాలు ఎప్పటికీ ముగియవు. కొంతమంది రాజులు ఎప్పటికీ మరణించరు'' అంటూ ఆ పోస్టర్‌కి జోడించిన వ్యాఖ్య సినిమాపై అంచనాలు పెంచేలా ఉంది. ''ప్రేక్షకుల్ని సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే సోషియో ఫాంటసీ థ్రిల్లర్ ఇది. సందీప్ కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన చిత్రంగా నిలవనుంది. ఆగస్టు నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభమవుతుంది'' అని నిర్మాతలు ప్రకటించారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడిస్తామన్నారు.

# 'బిల్డ్ నౌ'మాటున.. సరూర్నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి

- ఎల్బీనగర్ సర్కిల్ 12లో టౌన్ ప్లానింగ్ అధికారుల 'ముడుపుల' దందా
- రెండు ప్లాట్లు.. రెండు పర్మిషన్లు.. కానీ కట్టేది మాత్రం 'ఒక్కటే' భారీ కమర్షియల్ కాంప్లెక్స్!
- ఫిర్యాదులపై వార్త కథనాలపై నెలలు గడుస్తున్నా నోరు మెదపని డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ACP మధు, ఆర్చన
- ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్ చర్యలు ఎక్కడ..! మల్కాజ్గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి దృష్టి సారించాలి..!
- 'హైడ్రా' కమిషనర్ రంగంలోకి దిగితేనే అక్రమార్కుల గుట్టు రట్టు!






హైదరాబాద్, మార్చి 22 (భారత శక్తి) : ప్రభుత్వం ప్రజల సౌలభ్యం కోసం తెచ్చిన 'బిల్డ్ నో' (BuildNo) విధానం అధికారుల పాలిట కామధేనువుగా మారింది. సెల్ఫ్ సర్టిఫికేషన్ పేరుతో జరుగుతున్న ఈ దోపిడీకి ఎల్బీనగర్ సర్కిల్ 12 అడ్డాగా మారింది. హుడా కాలనీలో నిబంధనలను తుంగలో తొక్కి నిర్మిస్తున్న ఓ భారీ కట్టడం అధికారుల అవినీతికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. ఇక్కడ నిబంధనలు పనిచేయవు.. కేవలం 'నోట్ల కట్టలు' ఉంటే చాలు అన్నట్లుగా టౌన్ ప్లానింగ్ విభాగం వ్యవహరిస్తోంది.

*** ఒక్కటే ప్లాట్.. రెండు పర్మిషన్లు.. ఇదెక్కడి 'క్లబ్బింగ్' దందా?**

హుడా కాలనీలోని ప్లాట్ నంబర్ 39లో బిల్డర్లు ఆడుతున్న అక్రమకాండ అంతా ఇంతా కాదు. నివాస గృహాల పేరుతో అనుమతులు పొంది, క్షేత్రస్థాయిలో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా వాటిని విలీనం (Clubbing) చేసి భారీ వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తున్నారు.

**అక్రమాలకు వేదికైన ఫైల్ నంబర్లు ఇవే:**

010392/GHMC/03322/IABP/C5/2025

010390/GHMC/03321/IABP/C5/2025

ఈ రెండు ఫైళ్ల ద్వారా వేర్వేరుగా పర్మిషన్లు తీసుకున్నట్లు రికార్డుల్లో చూపించి, వాస్తవానికి ఒకే భారీ భవనాన్ని లేపుతున్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా, టౌన్ ప్లానింగ్ చట్టాలను అపహాస్యం చేయడమే.

*** డిప్యూటీ కమిషనర్ గారికి 'కనిపించదా'? ఏసీపీలకు 'వినపడదా'?**

ఈ అక్రమ నిర్మాణంపై గత కొన్ని నెలలుగా ఫిర్యాదులు అందుతున్నా, వార్తా కథనాలు వస్తున్నా అధికారులు మాత్రం 'మిన్నకుండి' పోతున్నారు. సర్కిల్ 12 డిప్యూటీ కమిషనర్ భువనగిరి శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ మధు, అధికారిణి ఆర్చనల మౌనం వెనుక భారీ స్థాయిలో ముడుపులు అందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదు అందిన తక్షణమే నోటీసులు జారీ చేసి పనులు నిలిపివేయాల్సి ఉండగా, అధికారులే బిల్డర్లకు 'రక్షణ కవచం'లా మారడం గమనార్హం. అధికారులు కేవలం సీట్లు అలంకరించడానికేనా? లేక అక్రమార్కులకు కొమ్ముకాయడానికా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

*** మృత్యు సెల్లార్లు.. ఫైర్ సేఫ్టీకి పాతర!**

నివాస భవనంగా అనుమతి పొంది, లోపల కమర్షియల్ హంగులు అద్దడమే కాకుండా.. రహస్యంగా లోతైన సెల్లార్లు తవ్వేస్తున్నారు. కనీస సెట్ బ్యాక్ లు లేవు, అగ్నిమాపక వాహనం వెళ్లే దారి లేదు. రేపు పొరపాటున అగ్ని ప్రమాదం జరిగితే జరిగే ప్రాణనష్టానికి ఈ అధికారులే బాధ్యత వహిస్తారా? నోటీసులు ఇస్తున్నామంటూ నెలల తరబడి కాలయాపన చేయడం వెనుక ఆంతర్యం ఏమిటో అందరికీ అర్థమవుతూనే ఉంది.

*** హైడ్రా రాకతోనైనా 'న్యాయం' జరుగుతుందా?**

చెరువుల రక్షణలో దూసుకుపోతున్న 'హైడ్రా' (HYDRAA) దృష్టి ఇప్పుడు ఇలాంటి అక్రమ కమర్షియల్ వెంచర్లపై పడాల్సిన అవసరం ఉంది. ఏసీబీ రంగంలోకి దిగి ఈ అధికారుల ఆస్తులపై విచారణ జరిపితే, ఈ 'బిల్డ్ నో' వెనుక ఉన్న అసలు అవినీతి తిమింగలాలు బయటపడతాయి. ఇప్పటికైనా మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి, ఎల్బీనగర్ లో వెలుస్తున్న ఈ అక్రమ కట్టడాన్ని సీల్ చేయాలని పౌర సమాజం డిమాండ్ చేస్తోంది.




# అంబేద్కర్ పేదల మనిషి... ప్రజలందరివాడు

*** క్రాంతి కళాబృందం అధ్యక్షుడు వెంకటాచారి**

జవహర్ నగర్ మార్చి 22 (భారత్ శక్తి): గ్రేటర్ హైదరాబాద్ జవహర్ నగర్ లోని బాలాజీ నగర్ చౌరస్తాలో అంబేద్కర్ మహనీయులకు 85వ జ్ఞానమాల కార్యక్రమం భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి నిర్వాహకులు మహంకాళి బిక్షు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా, మరియు అంబేద్కర్ పొందుపరిచిన రిజర్వేషన్ ఫలాలు కొంతమంది అనుభవిస్తూ ఆర్థికంగా బలపడి అంబేద్కర్ ని మరిచారని పలువురు పేర్కొన్నారుఏది ఏమైనా అంబేద్కర్ ఆశ సాధన కోసం . మహనీయుల ఆశయలను కొనసాగిస్తూ. భారత రాజ్యాంగాన్ని కాపాడుకునే దిశలో బహుజనులంతా ఏకమై బహుజన రాజ్యాన్ని స్థాపించాలని క్రాంతి కళాబృందం వెంకటాచారి అన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు గజ్జెల్లి రామచందర్, సురేష్, రవి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కొయ్యడ వెంకటేష్, వీరస్వామి, శంకర్, మహేష్, బాబు, తదితరులు పాల్గొన్నారు.




## విద్యకు ప్రభుత్వము
# బడ్జెట్లో 30% నిధులు కేటాయించాలి

*** ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్**

*** కాప్రా మండల అధ్యక్షుడు శ్యామ్ రావు**

కాప్రా, మార్చి 22 (భారత్ శక్తి) : ఎస్ఎఫ్ఐ కాప్రా మండల అధ్యక్షుడు శ్యామ్ రావు ఆధ్వర్యంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కు వ్యతిరేకంగా బడ్జెట్ దహనం కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ, ఈ బడ్జెట్ విద్యార్థుల ఆశలు, అవసరాలను పూర్తిగా విస్మరించిందని,ఇది విద్యార్థులపై స్పష్టమైన ద్రోహమని తీవ్రంగా విమర్శించారు. విద్య అనేది సమాజ అభివృద్ధికి పునాది అని, దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉండటంతో బడ్జెట్ లో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కానీ ప్రభుత్వం కేవలం 8 శాతం మాత్రమే కేటాయించడం ద్వారా విద్య రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే విద్యకు కనీసం 30% బడ్జెట్ కేటాయించాలని వివరించారు, ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ లు, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను కూడా ఈ తక్కువ నిధులతో తీర్చడం అసాధ్యమని తెలిపారు. ప్రైవేట్ కాలేజీలలో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువులు కొనసాగించలేకపోతున్నారని, సర్టిఫికేట్లు ఇవ్వకుండా మేనేజ్ మెంట్ లు వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెడ్చల్ జిల్లా కమిటీ సభ్యులు సాయి, నీరజ్, యశ్వంత్, అజయ్, మనిదీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మీ జవాను ప్లాటు కబ్జాకు టౌన్ ప్లానింగ్ అధికారుల సపోర్ట్..!

*** సరిహద్దులో కాపలా.. సొంతూరిలో దగా!**

*** CRPF అధికారి ప్లాట్లపై మాజీ కార్పొరేటర్ కన్ను.. ఖద్దరు అండతో కబ్జా పర్వం..**

*** హైకోర్టు ఆదేశాలూ బేఖాతరు.. GHMC అధికారులపై పొలిటికల్ ప్రెజర్?**

*** శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ చర్యలు ఎక్కడ..!**



హైదరాబాద్,మార్చి 22 (భారత శక్తి):దేశం కోసం ప్రాణాలకు తెగించి సరిహద్దుల్లో ఉగ్రవాదులతో పోరాడుతున్న ఒక జవానుకు సొంత గడ్డపై రక్షణ కరువైంది. జమ్మూ కాశ్మీర్లో దేశ భద్రత కోసం విధులు నిర్వహిస్తున్న CRPF సెకండ్ఇన్ కమాండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఎన్. ఆస్తులపై కబ్జా కోరలు చాచాయి. హైదరాబాద్ గచ్చిబౌలి పరిధిలోని గోపన్పల్లిలో ఆయనకు చెందిన విలువైన ప్లాట్లను స్థానిక కార్పొరేటర్, ఆయన అనుచరులు కలిసి అక్రమంగా ఆక్రమించుకున్న వైనం కలకలం రేపుతోంది. కోర్టులు మొట్టికాయలు వేసినా, పోలీసులు ఎఫ్ఐఆర్లు నమోదు చేసినా కబ్జాదారులు మాత్రం తగ్గడం లేదు సరికదా.. ఏకంగా అధికారుల ముందే బెదిరింపులకు దిగుతున్నారు.

**స్టేటస్ కో ఉన్నా.. కబ్జా ఆగలే!**

గోపన్పల్లి గ్రామంలోని సర్వే నెం. 155 AA, 156 AAలలో 2016లో డాక్టర్ ప్రవీణ్ కుమార్ ప్లాట్ నెం. 11, 12లను చట్టబద్ధంగా కొనుగోలు చేశారు. అయితే 2018 నుంచే ఈ ప్లాట్లపై కబ్జాదారుల కన్ను పడింది. అప్పట్లో చెట్టి శ్యామ్ బాబు అనే వ్యక్తి తన అనుచరులతో కలిసి సరిహద్దు గోడను కూల్చివేయడానికి ప్రయత్నించాడు. బాధితుడు సివిల్ కోర్టును ఆశ్రయించగా, కేసు తేలే వరకు 'యథాతథ స్థితి' (Status Quo) పాటించాలని కోర్టు స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చింది. చట్టాన్ని గౌరవించి అధికారి తన ప్లాట్ గోడను కూడా మరమ్మత్తు చేసుకోకుండా వదిలేశారు.

*** డ్యూటీలో జవాన్.. ప్లాట్లో ఫ్యాబ్రికేటెడ్ షెడ్!**

ప్రవీణ్ కుమార్ జమ్మూ కాశ్మీర్లోని బంతలాబ్లో విధుల్లో ఉన్న అదను చూసి కబ్జాదారులు రెచ్చిపోయారు. 2024 జనవరిలో గచ్చిబౌలి 105 డివిజన్ కార్పొరేటర్ వాసేపల్లి గంగాధర్ రెడ్డి, చెట్టి శ్యామ్ బాబు, శేఖర్ గౌడ్, కృష్ణారెడ్డి తదితరులు కలిసి ప్రవీణ్ కుమార్ ప్లాట్లతో పాటు పక్కనే ఉన్న BSF ఉద్యోగి రాఘవరావు ప్లాట్ను కూడా ఆక్రమించారు. పాత సరిహద్దు గుర్తులను తుడిచివేసి రాత్రికి రాత్రే కాంపౌండ్ వాల్ నిర్మించారు. బాధితుడు ఏప్రిల్ 2025లో సెలవుపై వచ్చి చూసేసరికి అక్కడ అక్రమంగా ఒక ఫ్యాబ్రికేటెడ్ షెడ్ను కూడా నిర్మించడం గమనార్హం.

*** అధికారులను బెదిరిస్తున్న మాజీ కార్పొరేటర్?**

ఈ వ్యవహారంలో GHMC అధికారుల తీరు అనేక అనుమానాలకు తావిస్తోంది. హైకోర్టు ఆదేశాల మేరకు జరిగిన విచారణ ఒక ప్రహసనంగా మారింది.

- నిందితుడి బదులు కార్పొరేటర్: విచారణకు అసలు నిందితుడు రాకుండా, ఆయన తరపున కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి హాజరై అధికారులను బహిరంగంగానే బెదిరించినట్లు తెలుస్తోంది.
- బేఖాతరు: హైకోర్టు నాలుగు వారాల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశించినా, GHMC డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఇప్పటివరకు ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయలేదు.

అధాంతరంగా నివేదికలు: అక్రమ నిర్మాణమని తేల్చినా కూల్చివేతలకు అధికారులు వెనకడుగు వేయడం వెనుక భారీ రాజకీయ ఒత్తిడి ఉన్నట్లు స్పష్టమవుతోంది.

**దేశ రక్షకుడికి ఇదేనా గౌరవం?**

"నేను సరిహద్దులో ఉండి దేశాన్ని కాపాడుతుంటే, ఇక్కడ నా ఆస్తిని కాజేస్తున్నారు" అని డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన డిపార్ట్మెంట్ గ్రీవెన్స్ సెల్ ద్వారా జిల్లా కలెక్టర్, GHMC కమిషనర్కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో ఆయన మీడియాను ఆశ్రయించారు. ఖద్దరు చొక్కాల అండతో సాగుతున్న ఈ భూదందాను అరికట్టి, తక్షణమే అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని బాధితుడు డిమాండ్ చేస్తున్నారు.

# ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

*** మాజీ మేయర్ మేకల కావ్య**

జవహర్ నగర్, మార్చి 22 (భారత శక్తి ) : ఆటో కార్మికుల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని, ప్రభుత్వం వారిని పట్టించుకొని ఆదుకోవాలని మాజీ మేయర్ మేకల కావ్య అన్నారు. జవహర్ నగర్ పరిధిలోని చెన్నాపురం సమీపంలో ఐకమత్యం ఆటో యూనియన్ కార్మికుల ఆధ్వర్యంలో ఆదివారం గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ మేయర్ కావ్య హాజరై మాట్లాడుతూ ఆటో కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదని, కార్మికులు ఐకమత్యంతో ముందుకు సాగితేనే హక్కులను సాధించుకుంటామని పిలుపునిచ్చారు. అనంతరం ఆటో కార్మికులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, జిల్లా నాయకుడు రాజశేఖర్, ఉద్యమకారుల ఫోరం జవహర్ నగర్ అధ్యక్షుడు సుధాకరాచారి, ఆటోయూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల జంగ్.. 25న 'ఛలో హైదరాబాద్'

* **సర్కారు నిర్లక్ష్యంపై నిప్పులు చెరిగిన TWJF**
* **బడ్జెట్‌లో మొండిచేయి.. హామీలు గాలికి**
* **ఐ అండ్ పీఆర్ ముట్టడికి సోమయ్య పిలుపు**

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (భారత శక్తి) : జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మొండివైఖరిపై తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (TWJF) యుద్ధం ప్రకటించింది. "మాటలు కోటలు దాటుతున్నా.. చేతలు గడప దాటడం లేదు" అన్న చందంగా తయారైన సర్కారు తీరుకు నిరసనగా ఈనెల 25న 'ఛలో హైదరాబాద్ ఐ అండ్ పీఆర్ కార్యాలయ ముట్టడి' కి పిలుపునిచ్చింది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కీలక సమావేశంలో ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడారు.

**రెండేళ్ల పాలన.. అన్నీ నీటిమూటలే!**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా, జర్నలిస్టుల సంక్షేమం అటకెక్కిందని సోమయ్య మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. "ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జర్నలిస్టుల ఊసే లేదు. ఇది పాత్రికేయ లోకంపై ప్రభుత్వం చూపిస్తున్న వివక్షకు పరాకాష్ట" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

* **సమస్యల సుడిగుండంలో కలం యోధులు:**

ప్రభుత్వం జర్నలిస్టులను ఉద్దేశపూర్వకంగానే ఇబ్బందులకు గురిచేస్తోందని సోమయ్య దుయ్యబట్టారు. ఆయన లేవనెత్తిన ప్రధానాంశాలు:

* అక్రెడిటేషన్ల అగచాట్లు: రెండేళ్లు దాటినా కొత్త కార్డులు ఇవ్వకపోవడంతో ఫీల్డ్‌లో జర్నలిస్టులు అవమానాలు ఎదుర్కొంటున్నారు.
* హెల్త్ కార్డులు హుష్కాకీ: అనారోగ్యం పాలైతే ఆదుకునే దిక్కులేదు. హెల్త్ కార్డుల జారీలో జాప్యం ప్రాణాల మీదకు తెస్తోంది.
* ఇళ్ల స్థలాల సాకు: సుప్రీంకోర్టు తీర్పును అడ్డం పెట్టుకుని ఇళ్ల స్థలాల కేటాయింపులో ప్రభుత్వం కాలయాపన చేస్తోంది.
* పెన్షన్ల విస్మరణ: పొరుగు రాష్ట్రాల్లో ఇస్తున్నట్లుగా రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్లు ఇచ్చే ఆలోచనే ఈ సర్కారుకు లేదు.
* మీడియా అకాడమీ నిద్ర: అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్‌ను నియమించకుండా నిర్వీర్యం చేస్తున్నారు.



**చిన్న పత్రికల గొంతు నులుముతున్నారు!**

చిన్న, మధ్య తరహా పత్రికలపై ప్రభుత్వం కక్ష సాధింపునకు దిగుతోందని సోమయ్య ఆరోపించారు. రెండేళ్లుగా అడ్వర్టైజ్‌మెంట్ బిల్లులు చెల్లించకపోవడంతో ఆయా పత్రికల యజమానులు, జర్నలిస్టులు వీధిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. RNI గుర్తింపు ఉన్నా ఎంపానల్‌మెంట్ చేయకుండా వివక్ష చూపుతున్నారని విమర్శించారు.

"జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే ప్రసక్తే లేదు. 25న జరిగే ఐ అండ్ పీఆర్ ముట్టడికి రాష్ట్రవ్యాప్తంగా పాత్రికేయులు తరలిరావాలి. మన హక్కులను పోరాడి సాధించుకుందాం."

**— మామిడి సోమయ్య, TWJF కన్వీనర్**

# పవర్‌లిఫ్టింగ్‌లో ప్రదీప్ కుమార్‌కు రజతం





* **అంతర్జాతీయ స్థాయిలో మెరిసిన తెలంగాణ వాసి..**
* **విశ్వగురు పురస్కారం ప్రదానం**

విశాఖపట్నం, మార్చి 22 (భారత శక్తి): అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో తెలంగాణకు చెందిన రిటైర్డ్ గెజిటెడ్ అధికారి డాక్టర్ పెరుమాళ్ల ప్రదీప్ కుమార్ అద్భుత ప్రతిభ కనబరిచారు. ఇటీవల జరిగిన ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆయన రజత పతకాన్ని సాధించి, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర కీర్తిని చాటారు.

**ఘనంగా సన్మానం**

విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించిన 'ఉగాది పురస్కారాలు 2026' కార్యక్రమంలో ప్రదీప్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ సత్యవోలు రాంబాబు నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలో ప్రదీప్ కుమార్ సాధించిన విజయాలను కొనియాడారు.

**హాజరైన ప్రముఖులు:**

ఈ పురస్కార ప్రదానోత్సవానికి పలువురు ఉన్నతాధికారులు, ప్రముఖులు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా:

>> శంకబ్రత బగ్చి: విశాఖ నగర పోలీస్ కమిషనర్ (IPS)
>> రవిశంకర్ మాలిశెట్టి: కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ (IRS)
>> రాజీవ్ కనకాల: సినీ నటుడు
>> తుమ్మిడి రామ్ కుమార్: ప్రముఖ పారిశ్రామికవేత్త

**స్ఫూర్తిదాయక ప్రస్థానం:**

రిటైర్మెంట్ తర్వాత కూడా పవర్‌లిఫ్టింగ్ వంటి క్రీడలో రాణించి అంతర్జాతీయ పతకం సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ప్రదీప్ కుమార్ విజయం యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తుందని వక్తలు పేర్కొన్నారు.

## మందుబాబుల గుండెల్లో రైళ్లు..
# మల్కాజిగిరి పోలీసుల 'స్పెషల్' డ్రైవ్..!

* **వీకెండ్ మత్తు వదిలించిన ట్రాఫిక్ పోలీసులు**
* **'డ్రింక్ అండ్ డ్రైవ్' వేటలో 214 మంది ఖైదీ**
* **రోడ్లపై యమపాశంలా తిరిగితే.. పదేళ్ల జైలు శిక్షే!**



మల్కాజిగిరి, మార్చి 22 (భారత శక్తి): వీకెండ్ ఎంజాయ్‌మెంట్ పేరుతో రోడ్లపై చిందులేసే మందుబాబుల ఆటకట్టించారు మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు. సాధారణ పౌరుల ప్రాణాలకు ముప్పు తెచ్చే తాగుబోతు వాహనదారులపై ఉక్కుపాదం మోపారు. రాత్రి సమయాల్లో గల్లీ గల్లీలో నిఘా పెట్టి, బాధ్యతారహితంగా వాహనాలు నడుపుతున్న 214 మంది మందుబాబులను పట్టుకుని, వారి మత్తు వదిలించారు. నిరంతరం నిఘా ఉంచుతూ రోడ్డు ప్రమాదాలను అరికడుతున్న పోలీసుల పనితీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

* **పోలీసుల పకడ్బందీ వ్యూహం.. ఫలితం ఇదీ!**

మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో పోలీసులు వేసిన పక్కా ప్లాన్‌తో వాహనదారులు బెంబేలెత్తిపోయారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన వారి వివరాలు ఇలా ఉన్నాయి:

టూ వీలర్లు (బైక్ రైడర్స్): 187 మంది
కార్లు (ఫోర్ వీలర్లు): 21 మంది
ఆటోలు: 5 మంది

**భారీ వాహనాలు: 1**

**హెవీ డోస్.. మత్తులో ఊగుతూ!**

పట్టుబడిన వారిలో 10 మంది వాహనదారులు ఏకంగా 301 mg నుంచి 550 mg వరకు






BAC (రక్తంలో ఆల్కహాల్ శాతం) కలిగి ఉండటం గమనార్హం. ఇంత భారీ స్థాయిలో మద్యం సేవించి వాహనం నడపడం అంటే మృత్యువుతో చెలగాటమాడటమేనని పోలీసులు హెచ్చరిస్తున్నారు. వీరందరినీ కోర్టులో హాజరుపరిచి కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నారు.

**కొత్త చట్టం.. పదేళ్ల జైలు శిక్ష!**

"తాగి బండి నడిపి ప్రాణాలు తీస్తే ఊరుకోం" అంటూ పోలీసులు గట్టి వార్నింగ్ ఇచ్చారు. భారతీయ న్యాయ సంహిత (BNS), 2023లోని సెక్షన్ 105 ప్రకారం.. మద్యం మత్తులో ప్రమాదానికి కారణమైతే అది 'హత్య కాని నేరపూరిత మానవహత్య' కిందకు వస్తుందని తెలిపారు. దీనికి గరిష్టంగా 10 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉందని డీసీపీ స్పష్టం చేశారు.

**కోర్టు మెట్లెక్కిన 128 మంది!**

గత వారం (మార్చి 1521) కాలంలో పట్టుబడిన 128 మందిని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తులు వారికి చురకలు అంటించారు. 120 మందికి భారీ జరిమానాలు విధించగా, మరో 8 మందికి జరిమానాతో పాటు 'సామాజిక సేవ' చేయాలని శిక్ష విధించారు. పోలీసుల ఈ కఠిన చర్యలు రోడ్డు భద్రతపై సామాన్యుల్లో నమ్మకాన్ని పెంచుతున్నాయి.

**డి.సి.పి, మల్కాజిగిరి కమిషనరేట్.**




# చెరువుల చెంత 'స్వచ్ఛ సండే'

* **బాదంగ్‌పేట్‌లో ఘనంగా సరస్సుల శుభ్రత కార్యక్రమం**

బాదంగ్‌పేట్, మార్చి 22 (భారత శక్తి) : ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బాదంగ్‌పేట్ సర్కిల్ 16 పరిధిలో ఆదివారం 'స్వచ్ఛ సండే - సరస్సుల శుభ్రత' కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ పి. సరస్వతి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున పాల్గొన్నాయి.

**ముమ్మరంగా పారిశుధ్య పనులు:**

సర్కిల్ పరిధిలోని అన్ని వార్డుల్లోని జలవనరులను శుభ్రం చేయడంలో భాగంగా, ముఖ్యంగా చందన చెరువు వద్ద విస్తృతస్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టారు. గుర్రపుడెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలు మరియు ఇతర చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో ARRO వేస్ట్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్, టెక్కీ రైడ్ (Techie Ride) ఎన్జీవో ప్రతినిధులు పాల్గొని, చెత్త నిర్వహణ మరియు పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు.




**భాగస్వామ్యంతోనే సాధ్యం:**

ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. చెరువుల సంరక్షణ కేవలం ప్రభుత్వంతోనే సాధ్యం కాదని, ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ అభినయ్ కుమార్, ఏఈ గంగ ప్రసాద్, ఏఎంఓహెచ్ డాక్టర్ ప్రవీణ్ మరియు ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# చలి వేంద్రాలు దాహార్తిని తీర్చడంలో దోహదపడతాయి

**: గండు ధనం రెడ్డి**

ఎల్బీనగర్, మార్చి 22 (భారత శక్తి): మండు వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని వెంకటేశ్వర కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు గండు ధనం రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం వెంకటేశ్వర కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోడ్డు నెంబర్ 4 వద్ద ఏర్పాటు చేసిన నుంచి నీరు, మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని కాలనీ అధ్యక్షుడు గండు ధనం రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసి దాహర్తిగా ఉన్న ప్రజలకు మంచినీటిని, మజ్జిగను అందజేస్తున్నామని పేర్కొన్నారు. చలి వేంద్రం గ్రిల్ షెడ్ ను బొక్క



రాంరెడ్డి, బొక్క ధనలక్ష్మిల జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బొక్క సత్యనారాయణ రెడ్డి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మొదటి రోజు మజ్జిగ పంపిణీ దాతలైన తులసి కృష్ణమూర్తి (బీబీజీ సెక్రెటరీ) పద్మజ దంపతులు బాటసారులకు మజ్జిగను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు మారోజు శ్రీనివాస్ రావు, కోశాధికారి సాయి కిరణ్, కమిటీ సభ్యులు కృష్ణంరాజు, శ్రీనివాసరావు, సుధాకర్ చారి, మునగాల నరేష్, బాలరాజు గుప్తా, సురేందర్ రాజు, చెన్న అనిల్ , కిరణ్ యాదవ్, వంశీ మోహన్ , బీబీజీ గ్రూప్ ఉపాధ్యక్షుడు బొలిశెట్టి జయ బాబు, కాలనీ వాసులు గండి వెంకట్రావు, మాధవ రావు, సోమ వెంకట్, వెంకట్ రాంరెడ్డి, మల్లికార్జున్, వసంత, శ్రీనివాస్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మల్ రెడ్డి రాంరెడ్డి

ఎల్బీనగర్, మార్చి 22 (భారత శక్తి) : ఎల్బీనగర్ నియోజకవర్గం లింగోజిగూడ డివిజన్ ముస్లిం సోదర సోదరీమణులకు ఆర్ఆర్డి చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, రంజాన్ పండుగ ముందు 30 రోజులు ఉపవాస దీక్షలు చేసిన, పవిత్రంగా జరుపుకునే ఈ రంజాన్ పండుగ అందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో,విలసిల్లాలని కోరుకుంటున్నా మని అన్నారు. అదేవిధంగా సరూర్నగర్ చెరువు కట్ట దగ్గర ఉన్న ఈద్గాకు వెళ్లి ఒకరికొకరు అలింగం చేసుకుంటూ రంజాన్ శుబాకాంకలు




తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏసీపీ క్రిష్ణయ్య కందికంటి శ్రీధర్ గౌడ్, జైపాల్ రెడ్డి, బి.ఆనంద్ గౌడ్, వేణు యాదవ్, కే కిషోర్ గౌడ్, ఎండీ షౌకాతుద్దీన్, ఎండీ షబ్బీర్, కాంగ్రెస్ నాయకులు,ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు శుభవార్త... రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 22 (భారత శక్తి): తెలంగాణ ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది. రైతు భరోసా పథకం కింద సాగుకు ఆర్థిక సాయం అందించేందుకు తొలి విడత నిధులను విడుదల చేసింది. సిద్దిపేట జిల్లా నర్మెటలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.3,590 కోట్లను విడుదల చేశారు. ఆదివారం బ్యాంకులకు సెలవు కావడంతో, ఈ మొత్తం సోమవారం రైతుల ఖాతాల్లో జమ అవుతుందని ప్రభుత్వం తెలిపింది. రైతు భరోసా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 1.50 కోట్ల ఎకరాలకు గాను రూ.9,000 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగా మొదటి విడతను విడుదల చేయగా, మరో 20 రోజుల్లో రెండో విడతగా రూ.2,650 కోట్లు, ఆ తర్వాత మరో 20 రోజుల్లో మిగిలిన రూ.2,760 కోట్లను విడుదల చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులకు ఎకరానికి ఏటా రూ.12,000 చొప్పున పెట్టుబడి సాయం అందుతుంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, రైతుల సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమానికి నెలకు రూ.2,533 కోట్లు ఖర్చు చేస్తే, తమ ప్రభుత్వం నెలకు రూ.5,500 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతుల కళ్లలో ఆనందం చూడటమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. పంట నష్టపోయిన రైతులకు కూడా పరిహారం అందిస్తున్నామని చెప్పారు. వరి ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉందని సీఎం వెల్లడించారు. ఈ సీజన్‌లో ప్రభుత్వం 71 లక్షల టన్నుల వరి ధాన్యాన్ని సేకరించిందని, అయితే కేంద్ర ప్రభుత్వం 50 లక్షల టన్నులకు మించి కొనుగోలు చేయడం లేదని విచారం వ్యక్తం చేశారు. రైతులు వరికే పరిమితం కాకుండా పంట మార్పిడిపై దృష్టి సారించాలని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రైతులు పండించే అన్ని పంటలకు లాభాలు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## హైదరాబాదులో శ్లాబు కూలి ఇద్దరు ఎలక్ట్రీషియన్ల మృతి

హైదరాబాద్, మార్చి 22 (భారత శక్తి): హైదరాబాద్‌లోని బేగంపేటలో ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. ఓ అపార్ట్‌మెంట్‌లోని బాల్కనీ శ్లాబు కూలిపోవడంతో ఇద్దరు ఎలక్ట్రీషియన్లు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని కుందన్‌బాగ్, మెథడిస్ట్ కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, మూడో అంతస్తులోని తన ఫ్లాట్‌లో ఎలక్ట్రికల్ పనుల కోసం ఇంటి యజమాని దివాకర్ ప్రసాద్ ఇద్దరు ఎలక్ట్రీషియన్లను పిలిపించారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన దేవిదాస్ (56), వివేక్ (32) పనులు చేస్తుండగా, యజమాని దివాకర్ బాల్కనీలో నిల్చుని ఉన్నారు. ఈ క్రమంలో బాల్కనీ శ్లాబు ఒక్కసారిగా కూలిపోవడంతో ముగ్గురూ కిందపడిపోయారు. ఈ దుర్ఘటనలో దేవిదాస్, వివేక్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన దివాకర్ ప్రసాద్‌ను ఆసుపత్రికి తరలించగా, ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చమురు, గ్యాస్ సరఫరాపై ఢిల్లీలో ప్రధాని మోదీ ఉన్నతస్థాయి సమీక్ష

ఢిల్లీ, మార్చి 22 (భారత శక్తి): పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశంలో పెట్రోలియం, ముడి చమురు, గ్యాస్, విద్యుత్, ఎరువుల రంగాల్లో సరఫరాకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడటంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు. ఈ కీలక రంగాల్లో సరఫరా వ్యవస్థను నిరంతరాయంగా కొనసాగించడం, లాజిస్టిక్స్‌ను పటిష్టం చేయడం, పంపిణీ వ్యవస్థలను క్రమబద్ధీకరించడం వంటి అంశాలపై చర్చించారు. దేశ ఇంధన భద్రతను కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ప్రధానికి వివరించారు. అంతర్జాతీయ మార్కెట్లలోని ఒడుదొడుకుల ప్రభావం వినియోగదారులు, పరిశ్రమలపై పడకుండా ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని ఉన్నతాధికారులు తెలిపారు. తగినన్ని నిల్వలను కొనసాగించేందుకు, సరఫరా గొలుసును బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రపంచ ఇంధన వాణిజ్యంలో కీలకమైన హార్ముజ్ జలసంధి వంటి సముద్ర మార్గాలకు అంతరాయం కలగవచ్చనే ఆందోళనల నేపథ్యంలో ఈ సమీక్ష ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిణామాలపై ప్రధాని మోదీ ఒకరోజు ముందే ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. శాంతి, స్థిరత్వం అవసరాన్ని నొక్కిచెప్పడంతో పాటు, అంతర్జాతీయ నౌకాయాన మార్గాలను సురక్షితంగా ఉంచాల్సిన ప్రాముఖ్యతను ఆయన వివరించారు. మధ్యప్రాచ్యంపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడంలో భాగంగా, భారతదేశం ఇప్పటికే తన చమురు దిగుమతులను అమెరికా, రష్యా, నైజీరియా వంటి దేశాల నుంచి పెంచుకుంది. ప్రస్తుతం మన చమురు దిగుమతుల్లో దాదాపు 70 శాతం గల్ఫ్ యేతర దేశాల నుంచే వస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఎల్‌పీజీ సరఫరాలో ఇబ్బందులు రాకుండా అమెరికా నుంచి కూడా దిగుమతులు చేసుకుంటున్నామని, వినియోగదారుల స్థాయిలో సరఫరాకు ఎలాంటి అంతరాయం లేదని వారు స్పష్టం చేశారు.

## ఖతార్‌లో కూలిపోయిన సైనిక హెలికాప్టర్... ఆరుగురి మృతి

- **ఖతార్ సముద్ర జలాల్లో కుప్పకూలిన సైనిక హెలికాప్టర్**
- **ప్రమాదంలో ఆరుగురు సిబ్బంది మృతి, ఒకరు గల్లంతు**
- **సాంకేతిక లోపమే కారణమని వెల్లడించిన రక్షణ శాఖ**
- **గల్లంతైన వ్యక్తి కోసం కొనసాగుతున్న ముమ్మర గాలింపు**
- **శత్రుచర్య కాదని స్పష్టం చేసిన అధికారులు**

మార్చి 22 (భారత శక్తి): ఖతార్‌లో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఆ దేశానికి చెందిన ఒక సైనిక హెలికాప్టర్ సముద్ర జలాల్లో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు సిబ్బంది మరణించగా, మరొకరు గల్లంతయ్యారు. గల్లంతైన వ్యక్తి కోసం అధికారులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. విధి నిర్వహణలో భాగంగా వెళ్లిన హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తడమే ప్రమాదానికి కారణమని ఖతార్ రక్షణ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. "ఖతార్‌కు చెందిన హెలికాప్టర్ రొటీన్ డ్యూటీలో ఉండగా సాంకేతిక సమస్య కారణంగా దేశ జలాల్లో కూలిపోయింది" అని ఆ ప్రకటనలో పేర్కొంది. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో మొత్తం ఏడుగురు సిబ్బంది ఉన్నారని ఖతార్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. వీరిలో ఆరుగురి మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన ఏడో వ్యక్తి కోసం కోస్ట్ గార్డ్, బోర్డర్ సెక్యూరిటీ, అంతర్గత భద్రతా దళాలకు (లెఖ్వియా) చెందిన ప్రత్యేక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఈ ఘటన జరగడంతో పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే, ఇది కేవలం సాంకేతిక లోపం వల్ల జరిగిన ప్రమాదమేనని, దీని వెనుక ఎలాంటి శత్రుచర్య లేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రమాదానికి గురైన హెలికాప్టర్ రకం, అది కూలిపోయిన కచ్చితమైన ప్రదేశం వంటి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం.. మారనున్న పాలిటెక్నిక్, ఐటీఐల భవిష్యత్

హైదరాబాద్, మార్చి 22 (భారత శక్తి): తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి విద్యలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించేలక్ష్యంతో, రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కాలేజీలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను (గతంలో ఐటీఐలు) తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏకీకరణతో నైపుణ్య శిక్షణకు సంబంధించిన అన్ని సంస్థలు ఒకే గొడుగు కిందకు రానున్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 113 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీలు స్కిల్స్ వర్సిటీ కిందకు రానున్నాయి. దీని ఫలితంగా, ఇప్పటివరకు ఈ కాలేజీల సిలబస్, పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తున్న రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి (ఎస్‌బీటీఈటీ) రద్దు కానుంది. అదేవిధంగా, కార్మిక శాఖ పరిధిలోని 63 ప్రభుత్వ ఏటీసీలు, 219 ప్రైవేట్ ఐటీఐలు కూడా ఈ వర్సిటీ పరిధిలోకి చేరనున్నాయి. ఈ సమగ్ర మార్పుల్లో భాగంగా, ఇప్పటివరకు పరిశ్రమల శాఖ కింద ఉన్న స్కిల్స్ యూనివర్సిటీని ఇకపై ఉన్నత విద్యాశాఖ పరిధిలోకి మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ విద్యా కమిషన్ అందించిన 'విద్యా విధానం 2026' సిఫార్సులకు అనుగుణంగా ఈ ఏకీకృత వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు, ఇంటర్మీడియట్ స్థాయిలోని ఒకేషనల్ కోర్సులు, విదేశాల్లో ఉపాధి కల్పించే తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టీఓఎమ్‌సీఓఎమ్) కూడా ఈ నూతన వ్యవస్థలో భాగం కానున్నాయి. ఈ సంస్కరణల ద్వారా సిలబస్ రూపకల్పనలో పరిశ్రమల అవసరాలకు ప్రాధాన్యత లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. గత ఏడాది ఆగస్టులో పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్య (PPP) విధానంలో ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి దీనికి ఛాన్స్‌లర్‌గా వ్యవహరిస్తుండగా, ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌కు ఛైర్మన్‌గా ఉన్నారు. ప్రస్తుతం గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో తాత్కాలికంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ వర్సిటీ కోసం, ఫ్యూచర్ సిటీలో 58 ఎకరాల్లో శాశ్వత ప్రాంగణాన్ని నిర్మిస్తున్నారు. ఈ అధికార బదిలీ, విలీన ప్రక్రియ పూర్తి కావడానికి సుమారు ఏడాది సమయం పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మార్పులతో తెలంగాణ యువత అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను సాధించేందుకు మార్గం సుగమం అవుతుంది.

## అధికార పీఠంపై 8,931 రోజులు... ప్రధాని మోదీకి అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు

ఢిల్లీ, మార్చి 22 (భారత శక్తి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత చరిత్రలోనే సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న నేతగా అరుదైన ఘనత అందుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. దేశానికి 8,931 రోజుల పాటు సేవ చేసి చారిత్రక మైలురాయిని చేరుకోవడంపై చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. "గౌరవనీయులైన భారత ప్రధాని నరేంద్ర మోదీ గారికి నా హృదయపూర్వక అభినందనలు. భారతదేశ చరిత్రలోనే అత్యధిక కాలం పాటు ప్రభుత్వ అధినేతగా సేవలందించిన వ్యక్తిగా చారిత్రక మైలురాయిని చేరుకున్న సందర్భంగా ఈ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. దేశానికి 8,931 రోజుల పాటు సేవను పూర్తి చేసుకోవడం నిజంగా ఒక అద్భుతమైన విజయం. ఈ అసాధారణ ఘనత, మన దేశ ప్రగతి, శ్రేయస్సు పట్ల ఆయనకున్న అంకితభావానికి, దార్శనిక నాయకత్వానికి, అవిశ్రాంత నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది. 2047 నాటికి 'వికసిత భారత్'ను నిర్మించాలన్న ఆయన దార్శనికత మనందరిలో స్ఫూర్తిని నింపుతూ, దేశాన్ని ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపిస్తోంది. దేశాన్ని మరింత ఉన్నత శిఖరాలకు చేర్చే ఈ ప్రయాణంలో ఆయనకు మరింత శక్తి, మంచి ఆరోగ్యం, మరిన్ని విజయాలు కలగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను" అంటూ చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.



## ఇక్కడో అద్భుతం జరిగింది... ఎవరూ చనిపోలేదు: నెతన్యాహు

మార్చి 22 (భారత శక్తి): ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆదివారం దక్షిణ ఇజ్రాయెల్‌లోని అరాడ్ నగరాన్ని సందర్శించారు. ఇరాన్ ప్రయోగించిన మిస్సైల్ పడిపోయిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. "నేను ఇక్కడ అరాడ్‌లో ఉన్నాను. ఇక్కడో అద్భుతం జరిగింది, ఎవరూ చనిపోలేదు. కానీ మనం కేవలం అద్భుతాలపై ఆధారపడదల్చుకోలేదు. ఈ పోరాటంలో మనమే గెలుస్తున్నాం, శత్రువును అణిచివేస్తున్నాం" అని నెతన్యాహు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 48 గంటల్లో జరిగిన ఘటనలు ఇరాన్ ప్రపంచ భద్రతకు ఎంత ప్రమాదకరమో నిరూపిస్తున్నాయని హెచ్చరించారు. అరాడ్, డిమోనా నగరాల్లోని పౌర ప్రాంతాలే లక్ష్యంగా ఇరాన్ మిస్సైళ్లతో దాడి చేసిందని, ఈ దాడుల్లో సుమారు 200 మంది గాయపడ్డారని తెలిపారు. అరాడ్‌లో రెండు భవనాల మధ్య క్షిపణి పడినా ప్రాణనష్టం జరగకపోవడం అదృష్టమని, కానీ పౌరులను చంపడమే ఇరాన్ ఉద్దేశమని ఆయన ఆరోపించారు. ఇటీవల ఇరాన్ ప్రయోగించిన ఖండాంతర బాలిస్టిక్ మిస్సైల్ (ఐసీబీఎమ్) హిందూ మహాసముద్రంలోని డీగో గార్సియా సైనిక స్థావరంపై పడిందని, అది 4,000 కిలోమీటర్లు ప్రయాణించిందని నెతన్యాహు పేర్కొన్నారు. "ఇరాన్ ఇప్పుడు యూరప్ లోతుల్లోకి కూడా చేరగల సామర్థ్యం కలిగి ఉంది. వారు అందరినీ తమ పరిధిలోకి తెచ్చుకున్నారు" అని ఆయన హెచ్చరించారు. అంతర్జాతీయ సముద్ర మార్గాలను, ఇంధన సరఫరా వ్యవస్థలను బెదిరిస్తూ ఇరాన్ ప్రపంచాన్ని బ్లాక్‌మెయిల్ చేయాలని చూస్తోందని నెతన్యాహు విమర్శించారు. ఇజ్రాయెల్, అమెరికాతో పాటు ప్రపంచ దేశాలన్నీ కలిసి ఇరాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తాము ఇరాన్ పౌరులను కాకుండా, ఆ దేశ పాలనాయంత్రాంగం, వారి స్థావరాలు, ఆర్థిక వనరులనే లక్ష్యంగా చేసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ ఘటనలతో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరాయి.

## అమెరికా ఆంక్షల ఫలితం... మరోసారి అంధకారంలోకి క్యూబా


మార్చి 22 (భారత శక్తి): కరేబియన్ దేశం క్యూబా మరోసారి అంధకారంలోకి జారుకుంది. దేశవ్యాప్తంగా విద్యుత్ సరఫరా చేసే జాతీయ గ్రిడ్ (నేషనల్ ఎలక్ట్రిక్ పవర్ సిస్టమ్) శనివారం సాయంత్రం పూర్తిగా కుప్పకూలింది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 6:32 గంటలకు ఈ వైఫల్యం సంభవించడంతో, దాదాపు కోటి మందికి పైగా ప్రజలు చీకట్లోనే గడపాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ వారంలో ఇలా జరగడం ఇది రెండోసారి కాగా, ఈ నెలలో ఇది మూడో అతిపెద్ద బ్లాక్‌అవుట్ కావడం అక్కడి సంక్షోభ తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ ఘటనపై క్యూబా ప్రభుత్వ విద్యుత్ సంస్థ యూనియన్ ఎలక్ట్రికా సోషల్ మీడియా ద్వారా ఒక ప్రకటన విడుదల చేసింది. జాతీయ గ్రిడ్ పూర్తిగా డిస్‌కనెక్ట్ అయిందని, పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపింది. కమాగ్వే ప్రావిన్స్‌లోని న్యూవిటాస్ థర్మోఎలక్ట్రిక్ ప్లాంట్‌లో జనరేటింగ్ యూనిట్ ఒకటి ఊహించని విధంగా విఫలమవడమే ఈ వైఫల్యానికి కారణమని ప్రాథమిక నివేదికలు చెబుతున్నాయి. ఈ నెల 4న, 16న కూడా ఇలాంటి వైఫల్యాలే దేశాన్ని గంటల తరబడి చీకట్లో ఉంచాయి. ఈ నిరంతర విద్యుత్ సంక్షోభం వెనుక అమెరికా ఆంక్షలు, ఇంధన కొరత ప్రధాన కారణాలుగా ఉన్నాయి. వెనెజువెలా నుంచి రాయితీ ధరలకు అందే చమురు సరఫరా నిలిచిపోవడం క్యూబాను తీవ్రంగా దెబ్బతీసింది. అమెరికా జోక్యంతో వెనెజువెలాలో ప్రభుత్వం మారడంతో ఈ సరఫరా ఆగిపోయింది. మరోవైపు, మెక్సికో కూడా చమురు ఎగుమతులను నిలిపివేసి,




కేవలం మానవతా సాయానికే పరిమితమైంది. ఇతర దేశాలు క్యూబాకు చమురు అమ్మితే కఠిన చర్యలు తప్పవని అమెరికా హెచ్చరించడం, ఇరాన్‌తో యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం వంటివి ఈ సమస్యను మరింత జటిలం చేశాయి. క్యూబా ప్రభుత్వం తమ ఆర్థిక ఇబ్బందులకు, విద్యుత్ వైఫల్యాలకు అమెరికా వాణిజ్య ఆంక్షలే కారణమని ఆరోపిస్తుండగా, అమెరికా మాత్రం క్యూబా అనుసరిస్తున్న సోవియట్ తరహా ఆర్థిక విధానాల వైఫల్యమే దీనికి కారణమని వాదిస్తోంది. వాస్తవానికి, దేశంలోని విద్యుత్ మౌలిక సదుపాయాలు చాలా వరకు పాతబడిపోయి, తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. తాజా బ్లాక్‌అవుట్‌తో రాజధాని హవానాతో సహా పలు నగరాల్లో ప్రజలు టార్చ్‌లైట్ల వెలుగులో రోడ్లపైకి రావడం కనిపించింది. ఆసుపత్రులు, తాగునీటి సరఫరా కేంద్రాలు వంటి అత్యవసర సేవలకు ముందుగా విద్యుత్ పునరుద్ధరించే పనులు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. అయితే, ఉత్పత్తి సామర్థ్యం చాలా తక్కువగా ఉండటంతో దేశవ్యాప్తంగా సాధారణ పరిస్థితులు నెలకొనడానికి ఇంకా సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఈ వరుస విద్యుత్ కోతలు క్యూబా ప్రజల దైనందిన జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.


# నమిశ్రీ 'ఆరియా'లో అక్రమాల కోట!

హైదరాబాద్, మార్చి 22 (భారత శక్తి) : నిబంధనలంటే సామాన్యుడికి గుదిబండలు.. బడా రియల్టర్లకు మాత్రం రబ్బరు బ్యాండ్లు! రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం తట్టి అన్నారం గ్రామంలో వెలుస్తున్న "నమిశ్రీ ఆరియా" (Namishree ARIA) ప్రాజెక్టు ఇప్పుడు అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఫోర్జరీ పత్రాలతో బ్యాంకుల కళ్లు గప్పి రూ. 100 కోట్ల రుణం పొందడం ఒకెత్తయితే, ఏకంగా అటవీ భూములను, ప్రభుత్వ ఆస్తులను మింగేస్తూ కాంక్రీటు కోటలు కడుతుండటం కలకలం రేపుతోంది. పోలీసు కేసులు, అధికారుల విచారణలు ఉన్నా.. 'తగ్గేదే లే' అన్నట్లుగా సాగుతున్న ఈ అక్రమ సామ్రాజ్యం వెనుక ఉన్న అదృశ్య హస్తం ఎవరిదనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.











### * ఫోర్జరీ పత్రాలే పునాదులు.. బ్యాంకుల 'డ్యూ డిలిజెన్స్' డూమ్ డూమ్!

సర్వే నంబర్ 121/P లో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు పునాదులే అక్రమాలతో పడ్డాయి. వ్యవసాయేతర భూమిగా మార్పిడి చేసే NALA సర్టిఫికేట్ దగ్గర నుండి భూమి పత్రాల వరకు అన్నీ ఫోర్జరీవేనని ఆరోపణలు ఉన్నాయి. విస్తుపోయే విషయం ఏంటంటే.. పక్కాగా తనిఖీలు చేయాల్సిన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ వంటి సంస్థలు, ఈ నకిలీ పత్రాలను చూసి ఏకంగా రూ. 100 కోట్ల నిర్మాణ రుణాన్ని ఎలా మంజూరు చేశాయి? ప్రజల సొమ్మును అప్పనంగా కట్టబెట్టే ముందు బ్యాంకులు జరిపే 'డ్యూ డిలిజెన్స్' ముడుపుల ముందు మోకరిల్లిందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### * అనుమతులు ఒకచోట.. నిర్మాణాలు మరోచోట!

>> నమిశ్రీ సంస్థ అరియా ప్రాజెక్టు కోసం సర్వే నంబర్ 121లో (సుమారు 2 ఎకరాల 35 గుంటలు) అనుమతులు పొందింది. కానీ క్షేత్రస్థాయిలో సీన్ రివర్స్!

>> అటవీ భూమి కబ్జా: పక్కనే ఉన్న సర్వే నంబర్ 117/6 లోని 4 ఎకరాల అటవీ భూమిని యథేచ్ఛగా ఆక్రమించారు.

>> ప్రభుత్వ భూమి స్వాహా: సర్వే నంబర్ 122లోని మరో 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా ప్రాజెక్టులో కలిపేశారు.

>> ఏడీ శ్రీనివాసులు ఇచ్చిన రెవెన్యూ స్కెచ్‌లో అక్రమాలు స్పష్టంగా కనిపిస్తున్నా, ఫారెస్ట్ ఆఫీసర్లు గాఢనిద్రలో ఉండటం వెనుక 'కాసుల' మత్తు ఉందనేది బహిరంగ రహస్యం.





### * ఎఫ్ఐఆర్ ఉన్నా ఆగని పని.. పోలీసులంటే లెక్కలేదా?

ఈ దందాలపై సామాజిక కార్యకర్తలు ఫిర్యాదు చేయడంతో ఇబ్రహీంపట్నం పీఎస్‌లో FIR (No. 293/2025) నమోదైంది. సంస్థ ప్రతినిధులు అమరేందర్ రెడ్డి, ధర్మవీర్ రెడ్డిలపై క్రిమినల్ కేసులు ఉన్నప్పటికీ, నిర్మాణాలు ఒక్క నిమిషం కూడా ఆగలేదు. సాధారణంగా వివాదాల్లో ఉన్న భూముల్లో పనులు నిలిపివేయాల్సి ఉన్నా, ఇక్కడ పోలీసుల ఎఫ్ఐఆర్ ను కూడా బేఖాతరు చేస్తూ పనులు కొనసాగిస్తుండటం వ్యవస్థల వైఫల్యానికి నిదర్శనం.

### * అవినీతి తిమింగలాలు.. ఏసీ గదుల్లో హెచ్ఎండీఏ సంతకాలు!

నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయి పరిశీలన చేయాల్సిన హెచ్ఎండీఏ అధికారులు, ఏసీ గదుల్లో కూర్చుని ఫైళ్లు ఎలా క్లియర్ చేశారు? నాగోల్ సర్కిల్ డీసీ రవీందర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి మధు తీరుపై బాధితులు మండిపడుతున్నారు.



NAMISHREE PROJECTS

TO WHOMSOEVER IT MAY CONCERN

Please find appended below the list of encumbrances on the land of the under-construction project "ARIA" situated at Survey 121/part, situated at Tatianaram Village, Abdullapurment Mandal, (Previously Hayathnagar Mandal, Ranga Reddy District). We undertake that the below disclosure is to the best of our knowledge and as per the information available with us as on date.

Disclosure:

The promoter has obtained financial assistance by way of Construction Finance of Rs.100,00,00,000/-(Rupees One Hundred Crore Only) from Bajaj Housing Finance Limited and has opened collection account for depositing project receivables with the account title "NAMISHREE PROJECTS ARIA COLLECTION ACCOUNT", having account no. 250002011978, IFSC code INDB0000006 with IndusInd Bank.

For Namishree Projects

Partner

15th Floor, T19 Towers, Ranigunj, Secunderabad-500003.
Ph: 040-29557744, Email : namishreeprojects@gmail.com, www.namishree.com

"మాకు సంబంధం లేదు.. హెచ్ఎండీఏను అడగండి" అంటూ తప్పించుకోవడం ముమ్మాటికీ బాధ్యతారాహిత్యమే. మరోవైపు సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు యథేచ్ఛగా సాగుతున్నాయి. తప్పుడు పత్రాలకు చట్టబద్ధత కల్పిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న ఈ అధికారుల వాటా ఎంత?

### * సామాన్యుడా.. జాగ్రత్త!




FIRST INFORMATION REPORT

మధ్యతరగతి ప్రజలు జీవితాంతం కష్టపడి దాచుకున్న సొమ్ముతో కొనే ఫ్లాట్లు రేపు వివాదాల్లో చిక్కుకుంటే దిక్కెవరు? రేరా (RERA) నిబంధనలను తుంగలో తొక్కిన ఈ ప్రాజెక్టును నమ్మితే నట్టేట మునగడం ఖాయమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

### * డిమాండ్:

వెంటనే హైడ్రా (HYDRAA) రంగనాథ్ గారు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఈ అక్రమ సామ్రాజ్యంపై




దృష్టి సారించాలి. తప్పుడు పత్రాలు సమర్పించిన డెవలపర్‌పై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అవినీతికి సహకరించిన అధికారులను సస్పెండ్ చేయాలి. సీఎం రేవంత్ రెడ్డి గారు ఈ 'అరియా' అక్రమాల కోటను కూల్చి అటవీ భూములను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

**నమిశ్రీ అవినీతి వెనుక ఓ బడా బి.ఆర్.ఎస్ నాయకుని హస్తం ఉన్నట్లు అంచనాలు.. మరిన్ని ఆధారాలతో తదుపరి కథనంలో..**

## చెరువుల గట్లను శుభ్రం చేసిన జిహెచ్ఎంసి సిబ్బంది

ఎల్బీనగర్, మార్చి 22 (భారత శక్తి): చెరువులలో గుర్రపు డెక్క పెరిగి దోమల వలన పడుతున్న బాధలను తట్టుకోలేక ప్రజల విన్నపాలను విని 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదివారం నాడు సరూర్నగర్, బైరామల్ గూడ చెరువుల గట్టునున్న ప్లాస్టిక్ కవర్లను, చెత్తాచెదారాన్ని శానిటేషన్, ఎంటమాలజీ, ఆర్ డబ్ల్యూఏ, జిహెచ్ఎంసి సిబ్బంది, స్థానికులు కలిసి 4 టన్నుల చెత్తను డంపింగ్ యార్డ్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ అడిషనల్ కమీషనర్ రఘు ప్రసాద్, సరూర్ నగర్ డిప్యూటీ కమీషనర్, ఎల్బీనగర్ సర్కిల్ ఇంచార్జి డిప్యూటీ కమీషనర్ బోనగిరి శ్రీనివాస్, శానిటేషన్ డిఈ నవీన్,



ప్రాజెక్ట్ ఆఫీసర్ విక్రాంత్ రెడ్డి, ఎంటమాలజీ సిబ్బంది అర్జున్, శ్యాంసుందర్, సూర్య, రాంకీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## 1990 బ్యాచ్ ఎల్ఐసి అధికారుల విరాళం

ఎల్బీనగర్, మార్చి 22 (భారత శక్తి): ఎల్బీనగర్ లోని అనాథ విద్యార్థి గృహంలోని విద్యార్థులకు యోగ క్షేమం వహామ్యహం చారిటీ ట్రస్టు చైర్మన్ వారణాసి కృష్ణమూర్తి ట్రస్ట్ సభ్యులు కలిసి గృహ అధ్యక్షులు మార్గం రాజేష్ సమక్షంలో 1990 వ సంవత్సరం బ్యాచ్ కు చెందిన ఎల్ఐసి ఉద్యోగులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆదివారం రూ.30,000 / విలువ గల మూడు సైకిల్స్, వాటి అన్ని పరికరాలు, వస్తువులు, పండ్లు, స్వీట్స్ విరాళంగా అందచేశారు. ట్రస్ట్ చైర్మన్ కృష్ణమూర్తి మాట్లాడుతూ, అనాథ గృహంలోని 100 మంది అనాథ, అణగారిన పిల్లలకు అద్భుత సౌకర్యాలు కల్పించి వారి చదువులకు, ఉజ్జ్వల భవిష్యత్తుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్న అనాథ విద్యార్థి గృహ కమిటీకి చేయూత నివ్వాలనే సంకల్పంతో మా యోగ క్షేమం వహామ్యహం చారిటీ ట్రస్టు తరుపున ముందుకు వచ్చిందని తెలిపారు. భవిష్యత్తులో వారి చదువులకు, వారి అవసరాలకు కూడా సహాయ సహకారాలు అందిస్తామని కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యోగ క్షేమం వహామ్యహం చారిటీ ట్రస్టు కోశాధికారి వసుంధర, ట్రస్టీలు రమేష్, ఎస్ వి.జి కృష్ణమూర్తి, రజనీ కుమార్, సూరికుమార్, రాజు, ఎస్విజి కృష్ణమూర్తి, విద్యార్థి గృహ అధ్యక్షులు మార్గం రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ రియల్ ఎస్టేట్ రంగానికి
# రేవంత్ సర్కార్ ఊతం..!

హైదరాబాద్, మార్చి 22 (భారత శక్తి) : తెలంగాణ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని మరింత పరుగులు పెట్టించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. భవన నిర్మాణ నిబంధనలు 2012కు సవరణలు చేస్తూ పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 95, నగర అభివృద్ధిలో సరికొత్త అధ్యాయానికి తెరలేపింది. ప్రధానంగా బదిలీ చేయదగిన అభివృద్ధి హక్కుల (TDR) వినియోగంలో తీసుకొచ్చిన సరళీకరణలు బిల్డర్లకు, సామాన్య పౌరులకు ఊరటనిచ్చేలా ఉన్నాయి.



### * హేతుబద్ధీకరణే లక్ష్యం.. అధికారుల కార్యదక్షత

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం, స్టేక్ హోల్డర్ల నుంచి వచ్చిన విన్నపాలను లోతుగా పరిశీలించి ఈ నిర్ణయం తీసుకుంది. క్షేత్రస్థాయి పరిస్థితులను అర్థం చేసుకుని, టీడీఆర్ వినియోగంలో ఉన్న ఇబ్బందులను తొలగించడంలో ఉన్నతాధికారులు ప్రదర్శించిన చొరవ అభినందనీయం. ఈ సవరణల వల్ల నిర్మాణ రంగంలో పారదర్శకత పెరగడమే కాకుండా, నగర




మౌలిక సదుపాయాల విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ మరింత సులభతరం కానుంది.

### * కీలక సవరణలు - ముఖ్యాంశాలు:

హైరైజ్ నిర్వచనంలో మార్పు: ఇకపై 21 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను మాత్రమే హైరైజ్ కేటగిరీలోకి చేరుస్తారు. దీనివల్ల మధ్యతరగతి నిర్మాణాలకు కొంత వెసులుబాటు కలుగుతుంది.

చిన్న ప్లాట్లకు మేలు: 750 నుండి 2000 చదరపు మీటర్ల విస్తీర్ణం గల ప్లాట్లలో 21 మీటర్ల వరకు ఎత్తుకు అనుమతిని టీడీఆర్ వినియోగం ద్వారా సులభతరం చేశారు.

అదనపు అంతస్తుల వెసులుబాటు: ప్లాట్ విస్తీర్ణం 2000 చదరపు మీటర్ల కంటే ఎక్కువగా ఉండి, రోడ్డు వెడల్పును బట్టి (40, 60, 80 అడుగులు) 3 నుంచి 5 అదనపు అంతస్తుల వరకు నిర్మించుకునే అవకాశం కల్పించారు.

సెట్ బ్యాక్ సడలింపు: నాన్‌హైరైజ్ మరియు హైరైజ్ భవనాల్లో టీడీఆర్ వినియోగం ద్వారా సెట్ బ్యాక్ లలో మినహాయింపులు పొందే వీలుంది, ఇది ఇరుకైన ప్రదేశాల్లో నిర్మాణాలకు ఊతమిస్తుంది.

ఫీజుల చెల్లింపులో వెసులుబాటు: మాస్టర్ ప్లాన్ రోడ్ల మార్పుల సమయంలో కన్వర్షన్ చార్జీలకు బదులుగా టీడీఆర్ ను సమర్పించే వెసులుబాటు కల్పించడం విశేషం.

### నిర్మాణ రంగానికి 'బూస్ట్'

ఈ కొత్త నిబంధనల ప్రకారం, 10 అంతస్తులకు పైబడిన భవనాలకు 3 నుండి 5 శాతం వరకు టీడీఆర్ వినియోగాన్ని తప్పనిసరి చేస్తూనే, దానిని విడతల వారీగా (అనుమతి సమయంలో 50%, ఆక్యుపెన్సీ సమయంలో 50%) సమర్పించేలా నిబంధనలను సరళీకరించారు. ఈ సంస్కరణలు హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో రియల్ ఎస్టేట్ రంగానికి కొత్త ఊపిరి పోస్తాయని నిపుణులు భావిస్తున్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.